
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 6 డిసెంబరు 2025 | 5





ఒకప్పుడు నేను మీకులాగే స్టూడెంట్‌ని.. ఇప్పుడు కలెక్టర్‌నయ్యా.. అదెలా సాధ్యమైందంటే.. నాకంటూ ఒక గోల్ .. పట్టుదల.. పట్టుదల ఉంటే కానిదిలేదు.. మీరు అలాగే లక్ష్యం పెట్టుకోండి..పట్టుదలగా చదవండి..

సృజనాత్మక బోధన సాగాలి : కలెక్టర్

సృజనాత్మకత పెంపొందించేలా బోధన సాగాలి. విద్యార్థులు నేర్చుకునే విధానంలో సాంకేతికత ఎంత వరకూ ఉపయోగపడుతోంది. అసైన్‌మెంట్లను మొబైల్‌లో చూసి కేవలం రాసే అలవాటుతో నిజమైన అభ్యాసం జరుగుతోందా అనే అంశాలను ఉపాధ్యాయులు సమీక్షించాల్సిన అవసరం ఉంది. సెల్‌ఫోన్ వల్ల కంటి చూపుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. స్కూల్స్‌లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లోని ఆవిష్కరణల ఆలోచనలను వెలికి తీయాలి. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం మన సంయుక్త బాధ్యత. వారి బంగారు భవిష్యత్తుకు దిశ స్పష్టంగా ఉండే విధంగా మార్గనిర్దేశం చేయడం తల్లిదండ్రులు, అధికారులు, ఉపాధ్యాయుల కర్తవ్యం.



మద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి అమ్మవారికి తెచ్చిన సారె

కోటసత్తెమ్మకు చీర, సారె

నిడదవోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ అమ్మవారు తిరునాళ్ల రెండో రోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. జంగారెడ్డి గూడెం మండలం గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి, నిడదవోలు పట్టణంలో మాంగళ్యదేవిఅమ్మవారి దేవస్థానం నుంచి చీర, సారె తీసుకొచ్చారు. బాణాసంచాలతో మేళతాళాలతో గణపతి సెంటర్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అధికారులు, పండితులు వారికి స్వాగతం పలికి చీర, సారె అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, మద్ది అంజనేయ స్వామి దేవస్థానం ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్‌కి కోరుకొండ సీఐ సత్యకిశోర్

కొత్త సీఐ నియామకం - ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌లకు బాస్‌లైన పలువురు సీఐల స్థాయి అధికారుల అవినీతిపై 'ఇదేంటి బాస్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కదలిక వచ్చింది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. నిఘా విభాగం డీజీ వెంటనే నివేదిక పంపాలని ఆదేశించారని తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరైన కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్‌పై తొలి వేటు పడింది. ఆయనపై ఆరు నెలల కిందటే తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఏదో విధంగా గప్‌చుప్ చేసేశారు. అయితే ఈసారి వేటు తప్పలేదు. ఆయనను ఏలూరు రేంజ్ వీఆర్‌కి పంపుతూ శుక్రవారం డీజీ ఉత్తర్వులిచ్చారు. ఆ స్థానంలో విజయవాడ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణమూర్తిని నియమించారు. జిల్లాలోని పలువురు సీఐ స్థాయి అధికారులపై రాష్ట్ర స్థాయి అధికారులు దృష్టి సారించినట్టు చెబుతున్నారు.

ఆనందాలబడి!



- పండుగలా పీటీఎం
- సందడిగా పాఠశాలలు
- తరలివచ్చి పేరెంట్స్
- ఆనందంగా చిన్నారులు
- మంచిపై అవగాహన
- ప్రభుత్వ బడుల్లో నిర్వహణ
- 5 లక్షల మంది హాజరు

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బడి వాతావరణం మారిపోయింది.. మామిడి తోరణాలు..స్వాగతం బోర్డులతో నిండిపోయాయి..పూలదండలతో అలంకరించుకొన్న బడులు తల్లిదండ్రులు, ప్రముఖులకు స్వాగతం పలికాయి. భారీ టెంట్‌లు.. మరో పక్క వంటలు.. ఇంకో పక్క నిన్నటి వరకూ పుస్తకాలతో నీరసంగా బడిబాట పట్టిన చిన్నారులు.. శుక్ర వారం ఆడుతూ పాడుతూ బడి కొచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆనందంగా గడిపారు. తల్లిదండ్రులు, గురువుల ఆత్మీక కలయిక పండుగ వాతావరణంలో జరిగింది. జిల్లాలో 988 ప్రభుత్వ, 586 ప్రైవేటు పాఠ శాలల్లోని 2,37,754 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, అధికారులు, ఆ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు తదితరులు కలిపి సుమారు 5 లక్షల మంది వేడుకలకు హాజరయ్యారు. పిల్లల బంగారు భవితకు బడి వైపు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరవలి మం డలం ముక్కామలలో మంత్రి దుర్గేష్, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో కలెక్టర్ కీర్తి చేకూరి, కొవ్వూరులో ఎస్పీ నరసింహ కిశోర్ పాల్గొన్నారు. ధవళేశ్వరంలో రాజమ హేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, బిక్కవోలు మండలం పందలపాకలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కోరుకొండలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వ రరావు, నల్లజర్ల మండలం దూబ చర్లలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. చిన్నారులతో ముచ్చటించారు. కలిసి భోజనం చేశారు..వారు చేసిన సైన్స్ ప్రాజె క్టులు చూసి ఆనందం వ్యక్తం చేశారు. మా చిన్నప్పుడు అంటూ తమ పాత రోజులను గుర్తు చేసుకున్నారు.ఉన్నత స్థాయికి ఎదిగే క్రమంలోని పరిశ్రమ, పట్టుదల, లక్ష్యసాధనను వివరించారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రు లకు ఉపాధ్యాయులు నివేదించారు. విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు, క్రాఫ్టులు ఆలో చింపజేశాయి. ప్రోగ్రెస్ కార్డులను అందించారు. విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తూ పెద్దలు భోజ నాలు చేశారు. సెల్ఫీలు సందడి చేశాయి.

రేపటి భవిష్యత్ మీరు : మంత్రి

నేను మీ స్థాయి నుంచి వచ్చినవాడినే.. రేపటి భవిష్యత్ మీరు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు నిర్మాణ మవుతుంది. ప్రతీ అంశం గురువుల ద్వారా విద్యార్థులకు తరగతి గదిలోనే బోధపడుతుంది. పాఠశాలకు పంపించడమే కాకుండా తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత ఆ రోజున పిల్లలు పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో తల్లిదండ్రులు గమనించడం ముఖ్యం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య అనుసంధానం లేకపోతే పిల్లలను తీర్చిదిద్దం కష్టం.



విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి, ఆదిరెడ్డి వాసు



ఫస్ట్ మాస్టార్‌ని.. తర్వాతే ఎస్పీనయ్యా!

నేడు ఒకప్పుడు టీచర్‌ని..మీలాంటి ఎంతో మంది పిల్లలకు పాఠాలు చెప్పినవాడిని.. సమాజానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో చదివా పోలీస్‌నయ్యా.. మీ జిల్లా ఎస్పీగా ఉన్నా. పట్టుదల ఉంటే కానిది ఉండదు.. పట్టుదలగా చదవాలి.. ఎదగాలి. తల్లితండ్రులు పిల్లలను చదివించడమే కాకుండా మంచి ప్రవర్తన కలిగి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మాదకద్రవ్యాలు ఒకప్పుడు మారుమూల మన్యంలో మాత్రమే ఉండేవి. నేడు మెరుగైన రవాణా, సెల్‌ఫోన్ వినియోగంతో విద్యార్థులకు సైతం అందుబాటులోకి వస్తుంది. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలి. సమాజంలో చెడు అలవాట్ల కారణంగా క్రైమ్ పెరుగుతుంది. ఈ క్రైమ్‌లో ఎక్కువగా మహిళలు, పిల్లలు బాధితులుగా ఉంటున్నారు. కొవ్వూరు పాఠశాలలో పనిచేస్తున్న తన మిత్రుడు రవికుమార్ ఆహ్వానంపై ఈ కార్యక్రమానికి రావడం జరిగింది.



రాజమహేంద్రవరంలో గత పుష్కరాలకు నిర్మించిన అతిపెద్ద కోటిలింగాల ఘాట్

పుష్కర.. గోదారి!

ఇప్పటి నుంచే పుష్కర సన్నాహాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

2027 గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.12 ఏళ్లకోసారి వచ్చే గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించ నున్నారు. కోట్లాది మంది భక్తులు తరలి వచ్చే పుష్కర స్నానాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గోదావరి వెంబడి స్నానపు ఘాట్లను భారీస్థాయిలో సిద్ధం చేస్తోం ది. ఒకేసారి లక్షలాది మంది స్నానం చేసేలా ఘాట్లను తీర్చిదిద్దనున్నారు.పుష్కర స్నానాలు రాజమహేంద్రవరం, కొవ్వూరులో అత్యధికంగా జరగనుండగా ఆ తర్వాత కాకినాడ, కోనసీమ జిల్లాల్లో జరగనున్నాయి.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్

- 2027లో గోదావరి పుష్కరాలు
- కోట్లాది మంది భక్తుల అంచనా
- మరిన్ని ఘాట్లకు ప్రతిపాదనలు
- ప్రజాప్రతినిధుల అంచనాలు
- కాకినాడలో 10 ఘాట్లు
- ఉమ్మడి జిల్లాలో పుష్కర సందడి

కాకినాడలో 10 ఘాట్లు..

కాకినాడ జిల్లాలో పది ఘాట్లను రూ.5 కోట్లతో సుందరీకరించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. పదిలో కాజులూరు మండలంలో రెండు, తాళ్లరేవు మండలంలో 8 ఘాట్లను ముస్తాబు చేయాలని నిర్ణయించింది. ఒక్కో ఘాట్ 15 నుంచి 30 మీటర్ల మేర పొడవుతో నిర్మిస్తోంది. కాజులూరు మండలం పెద్దలంక, అండ్రంగి, తాళ్ల రేవు మండలం పిల్లంక, గోపుల్లంక, గోవలంక వద్ద 20 మీటర్ల పొడవైన ఘాట్ల ను ఆధునికీకరిస్తోంది.కొత్తగా ఇంజరం, పిల్లంక వద్ద కొత్తలంక పరిధి , తాళ్లరేవు పట్టణం ఐత్రీయ కోరంగి బ్రాంచి వద్ద నందిరేవులో కొత్త స్నానపు ఘాట్‌ను నిర్మించనున్నారు. కోరంగిలో శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద గోదావరిని ఆనుకుని మరో ఘాట్ నిర్మించనున్నారు. తాళ్లరేవు మండలంలో సిద్ధం చేస్తోన్న ఎనిమిది ఘాట్లకు కాకినాడతో పాటు కోనసీమ జిల్లా నుంచి భారీగా పుష్కర స్నానాలకు భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అఖండ గోదావరి నది సముద్రంలో సంగమించే చివరి ప్రాంతం తాళ్లరేవు, యానాం కావడంతో పుష్కర స్నానాలకు భక్తులు ఇక్కడకు భారీగా వస్తారని భావిస్తు న్నారు.పైగా గోదావరి మూడు పాయలు కలిసే ప్రాంతం ఇక్కడే కావడంతో సెంటిమెంట్‌గా భావించి స్నానాలకు ఇక్కడకు వచ్చే వారు లక్షల్లో ఉంటారని లెక్కలేస్తున్నారు. 2015 పుష్కరాల్లో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గోదావరి మూడు పాయలు కలిసే యానాం సమీపంలో పుష్కర స్నానం ఆచరించడంతో ఇక్కడ స్నానమాచరిస్తే మరింత పుణ్యం వస్తుందని ప్రచారం జరిగి అప్పట్లో లక్షల్లో పోటెత్తారు. దీంతో ఈసారి కూడా ఎంత రద్దీ వచ్చినా తట్టుకునేలా ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కోనసీమలో కోటిపల్లి, కపిలేశ్వర పురం, యానాం, నగరం, అప్పనపల్లి, ముక్తేశ్వరం, మురమళ్ల, కుండలేశ్వరం, కొత్తపేట, జొన్నాడ, రావులపాలెం తదితర ప్రాంతాల్లో ఘాట్లు ఉన్నాయి. ఈ జిల్లాలో కూడా ఘాట్లు పెంచే యోచనలో ఉన్నారు.

రాజమహేంద్రవరంలో ఒకే ఘాట్ అయ్యేనా?

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 2027లో జరిగిన గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి తగ్గట్టుగా స్నానాల రేవుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గత నెలలో మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అధికారులు, ఎమ్మెల్యేలతో నూతన ఘాట్లు, ఘాట్ల అనుసంధాన ప్రక్రియపై చర్చించారు.రాజమహేంద్రవరంలో గౌతమి ఘాట్ మొదలుకొని పుష్కరాల రేవు వరకూ ఘాట్లను అనుసంధానం చేసే ప్రక్రియపై ప్రతిపాదనలు ఉన్నాయి.ఈ ఘాట్లు కలుపుతారా విడివిడిగా అభివృద్ధి చేస్తారా అనేది తేలాల్సి ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో నాల్గో బ్రిడ్జి కింద నుంచి రెండు అతిపెద్ద వీఐపీ ఘాట్లను నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. రాజానగరం నియోజకవర్గం బొబ్బిల్లంక, మునికూడలి ప్రాంతాల్లోనూ ఘాట్లు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

కొవ్వూరులో ఇలా..

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.135.50 కోట్లతో 53 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో 8 రేవులు 1.2 కిలోమీటర్ల మేర రూ.90 కోట్లతో ఒకే ఘాట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఘాట్లను భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తరించడంతో, మరి కొన్ని కొత్తఘాట్లను ప్రతిపాదించారు. కొవ్వూరు పట్టణ, మండలంలో పాతవి 20, కొత్తవి 8, తాళ్లపూడి మండలంలో పాతవి 8, కొత్తవి 2, నిడదవోలు పట్టణ, మండలంలో పాతవి 3, కొత్తవి 2, పెరవలి మండలంలో పాతవి 7, కొత్తవి 3 ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు.నిడదవోలు మండలం విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు గోదావరి ఏటిగట్టు రహదారి సుమారు 30 కి.మీ రూ.70 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెప్పారు

మధురపూడి ఎయిర్‌పోర్ట్



అదిగో..ఇండిగో..

వచ్చేస్తోంది!

- ఆకాశంవైపు చూపులు
- ఎంతకీ రాని విమానాలు
- పలు సర్వీసులు రద్దు
- ప్రయాణికుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వియాన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. విమానాలు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఎప్పుడు విమానం వస్తుందో ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఇండిగో విమాన పైలెట్ల రెస్ట్ విషయంలో ఏర్పడిన వ్యవహారంతో కొన్ని విమానాలు రద్దవడంతో పాటు కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో అనేక మంది ప్రయాణాలు మానుకోగా.. మరికొందరు విమానాశ్రయాల్లో వేచి చూస్తున్నారు. రాజ మహేంద్రవరం నుంచి అనేక మంది న్యూఢిల్లీ, ముంబయి,హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు ప్రతీ రోజు వందలాది మంది విమా నాల్లో ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం ఇండిగో విమాన సంస్థలో ఏర్పడిన సమస్యతో సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. పైలెట్ల కొరత తెరమీదకు వచ్చింది. ఇండిగో యాజమాన్యం పైలెట్లకు విశ్రాంతి ఇవ్వడంలేదని సమాచారం బయటకు రావడంతో ఎయిర్‌పోర్టు అథార్టీ పైలెట్లకు విశ్రాంతి తప్పనిసరి చేసినట్టు సమాచారం. దీంతో పైలెట్ల కొరత ఏర్పడి విమానాలు రద్దవుతున్నాయి. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి ప్రతి రోజూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి,న్యూఢిల్లీ 11 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తిరుపతికి రోజు విడిచి రోజు ఒక విమానం వెళ్లొస్తుంది.కానీ గురువారం నుంచి ఆకస్మికంగా విమానాలు రద్దవడం,ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.గురువారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి ముంబయి వెళ్లాల్సిన 160 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలో జాగరణ చేశారు. రాత్రి 8.30 గంటలకు రావాల్సిన ముంబయి విమానం శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు వచ్చింది. తిరిగి ఐదు గంటలకు వెళ్లింది. ఎయిర్‌పోర్టు, విమాన సంస్థ అధికారులు కొందరు ప్రయాణికులకు రాజమహేంద్రవరంలో హోటల్ రూమ్‌లు బుక్ చేయగా, కొందరు ఇళ్లకు వెళ్లి వచ్చారు.రాజమహేంద్రవరం విమానాశ్రయంలో గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ఇక శుక్రవారం న్యూఢిల్లీ, ముంబయి విమానాల సర్వీసు రద్దయింది. బెంగళూరు, చైన్నై, హైదరాబాద్ నుంచి రావాల్సిన విమా నాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. బెంగళూరు నుంచి శుక్రవారం ఉదయం రావాల్సిన విమానం అర్ధరాత్రి 12 గంటలకు రావొచ్చని అధికారులు చెబుతున్నారు.దీంతో సుమారు 70 మంది ప్రయాణికులు ఈ రాత్రి కూడా ఎయిర్‌పోర్టులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై విమానం శుక్రవారం రావాల్సి ఉండగా శనివారం రానున్నట్టు సమాచారం. గురువారం 670 మంది ప్రయాణం చేయగా.. శుక్రవారం బాగా తగ్గడం గమనార్హం.

4 విమాన సర్వీసులు రద్దు

మరో నాలుగు ఆలస్యం

కోరుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయం నుంచి ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు,హైదరాబాద్‌లకు వెళ్లాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్ సంస్థకు చెందిన 4 విమాన సర్వీసులు శుక్రవారం రద్దయ్యాయి. అదే విధంగా మరో నాలుగు విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. హైదరాబాద్- రాజమహేంద్రవరం మధ్య నడిచే విమాన సర్వీసు 45 నిమిషాలు, మద్రాసు-రాజమహేంద్రవరం మధ్య విమానసర్వీసు 30 నిమిషాలు,హైదరాబాద్- రాజమహేంద్రవరం మధ్య నడిచే విమాన సర్వీసు 1.15 గంటలు,హైదరాబాద్-రాజమహేంద్రవరం మధ్య నడిచే మరో విమాన సర్వీసు 2 గంటలు ఆలస్యంగా నడిచాయి. ఇండిగో ఎయిర్ లైన్స్ సంస్థకు దేశ వ్యాప్తంగా పైలెట్స్ కొరత కారణంగా ఈ సర్వీసులు రద్దు అయినట్టు తెలిసింది. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ టెస్టు కిట్లు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ అనుమానిత కేసులకు ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు 20 స్క్రబ్ టైఫస్ నిర్ధారణ ర్యాపిడ్ కిట్లు సిద్ధం చేసినట్టు సమాచారం. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ శుక్రవారం అందరు క్లినికల్ వైద్యులకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. అనుమానిత కేసులకు సంబంధించిన శాంపిల్స్‌ను మైక్రోబయాలజీ విభాగానికి పంపించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. కిట్లు దుర్వినియోగం కాకుండా సంబంధిత వైద్యుడి సంతకం, స్టాంపుతో ఎమర్జన్సీ అని రాసి శాంపిల్స్ పంపించాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ కేసులు ఒక చిన్న పురుగు కుట్టడం ద్వారా వస్తుందన్నారు.

రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం : నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కొమరిపాలెంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.14 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు ధాన్యం అమ్మిన 4 నుంచి 24 గంటల్లో సొమ్ములు వారి ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. గతంలో మీహయాంలో ధాన్యం చెల్లింపులు ఎలా చేసారో ఆత్మ విమర్శ చేసుకోవాలని వైసీపీ వారికి సూచించారు.రబీ సాగుకు యూరియా కొరత లేదన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు 7500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా వ్యవసాయశాఖ ఆధీనంలో 9 వేల మెట్రిక్ టన్నులు ఉందన్నారు. రబీ సీజన్‌లో ఎకరాకు రైతు 150 కిలోల యూరియా వాడాల్సి వుండగా మూడు రెట్లు అధికంగా వాడడం వల్ల ఖర్చు పెరిగి, దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. అందు వల్ల కేంద్రప్రభుత్వం రైతులను యూరియా, పురుగుమందులు వాడకం తగ్గించి పకృతి సిద్ధంగా లభించే ఎరువులు వాడాలని సూచిస్తుందన్నారు.ఆయన వెంట కూటమి నేతలు పడాల వెంకటరామారెడ్డి, డీవీఆర్, దుర్గారెడ్డి, కర్రి సత్యవేణి, చిన్నం వీరభద్రారెడ్డి, ఇందల వీరబాబు ఉన్నారు.





పోలీసు శాఖకు వెన్నెముక

నేడు హోంగార్డ్స్ రైజింగ్ డే

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు వెన్నెముక హోంగార్డు వ్యవస్థ. హోంగార్డ్స్ రైజింగ్ డేను ప్రతిఏటా డిసెంబరు 6న జరుపుకుంటారు. 1946లో ముంబయిలో జరిగిన మతపరమైన అల్లర్లను నియంత్రించడానికి పోలీసులకు సహకరించేందుకు తొలుత హోంగార్డులను తీసుకున్నారు. అప్పుడు ఏర్పడిన ఈ వ్యవస్థ శాంతి భద్రతల పరిరక్షణ, వరదలు, అగ్నిప్రమాదాల సమయంలో కీలకమైంది. హోంగార్డుల గుర్తించడం, వారికి గౌరవ మర్యాదలు కల్పించడం, అత్యవసర సమయాల్లో వారి పాత్రను తెలియచెప్పడం వంటివి రైజింగ్ డే ముఖ్య ఉద్దేశ్యం. గతంలో హోంగార్డులను స్వచ్ఛంద రక్షణ దళం అనేవారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు, శాంతిభద్రతలు అదుపు తప్పినప్పుడు కానిస్టేబుల్ కన్నా ముందు హోంగార్డు నిలబడతాడు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1000 మంది హోంగార్డులు ఉండగా వారిలో 400 మంది మహిళే కావడం గమనార్హం. వారి పాత్ర ఎంతో కీలకం. అయితే వారికి వేతనాన్ని ఇప్పటికీ రోజువారీ కూలి మాదిరిగానే ఇస్తున్నారే తప్ప సేవలకు తగ్గ ఫలితం ఉండట్లేదు. సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నా జీతం రూ.25 వేలకు మించి లేదు. మహిళా హోంగార్డులకు కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తినా చికిత్స చేయించుకునేందుకు ఎటువంటి రాయితీలూ లేవు. ఉన్నతాధికారులు తమకు క్షేత్రస్థాయిలో సంరక్షణ అందించగలిగితేనే నిజమైన రైజింగ్ డే అని హోంగార్డులు చెప్తున్నారు.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండి ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి.. ఏ మాయ జరుగుతోందో కానీ వీటి ధరలు వెనక్కి తిరిగి చూడట్లేదు. వచ్చే ఏడాది మరింత పెరిగే అవకాశముందని బంగారం వ్యాపార నిపుణుల అంచనా. ఈ ఏడాది జనవరిలోనే కళ్లు తిరిగేలా ధరలు పెరిగాయి. అయితే ధరలు పెరిగే కొద్దీ కొనుగోళ్లు కూడా పెరుగుతుండడం గమనార్హం. జనవరి నుంచి క్రమంగా పెరుగుతున్న బంగారం... ఇటీవల వరలక్ష్మీ పూజ, వినాయ చవితికి పెరుగుతూ వచ్చి, దసరా సమయంలో మరింత పెరిగిపోయింది. అక్టోబరు, నవంబరుల్లోనూ కూడా బాగా పెరిగింది. ఈ నెల ప్రారంభంలో మరింత దూసుకుపోతోంది. బంగారం ధర 22 క్యారెట్ ఒక గ్రాము రూ.11,980గా ఉంది. ఇది రూ.12వేలకు చేరుతుందనే అంచనా ఉంది. 10 గ్రాముల ధర 1,19,800 ఉంది. 24 క్యారెట్ ఒక గ్రాము ధర 13,069. ఈ ఏడాది ఇదే రికార్డు ధర. 10 గ్రాముల ధర రూ.1,30,690కు చేరింది.

ఇక ఈ ఏడాది జనవరి 1న 22 క్యారెట్ 10 గ్రాముల ధర కేవలం రూ.71,150గా ఉంది.





చుక్కలనంటిన బంగారం ధరలు

22 క్యారెట్ 10 గ్రాములు	రూ.1,19,800
24 క్యారెట్ 10 గ్రాములు	రూ.1,30,690
వెండి కిలో	రూ.1.79 లక్షలు

11 నెలల తర్వాత రూ.1,19,800 అయ్యింది. అంటే ఏకంగా 48,650 పెరిగింది.

24 క్యారెట్ ధర జనవరి 1న రూ.78వేలు మాత్రమే ఉంది. ఇవాళ రూ.1,30,690కి చేరింది. అంటే ఏకంగా 52,690 పెరిగింది. సుమారు 11 నెలల వ్యవధిలో బంగారం ధరలు ఇంత రికార్డు స్థాయిలో పెరడం బులియన్ మార్కెట్ చరిత్రలో ఇదే మొదటిసారి.

జనవరిలో బంగారం కొనుగోలు చేసిన వారికి బాగా లాభం వచ్చినట్టే.

వెండి ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. జనవరిలో కిలో రూ.88,400 కాగా ఇవాళ సుమారుగా రెట్టింపు దాటి పెరిగిపోయింది. బుధవారం రూ.1.84 లక్షలు, గురువారం రూ.1.82 లక్షలు కాగా శుక్రవారం కాస్త తగ్గి రూ.1.79 లక్షలకు దిగింది. కానీ మళ్లీ పెరిగిపోయే అవకాశాలున్నాయని చెప్తున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు పెరిగింది 120శాతం వరకు ఉండడం గమనార్హం. వెండి ధర రూ.2లక్షలకు చేరే అవకాశం ఉన్నట్టు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వెండి కిలో బార్లకు, నాణేలకు బాగా డిమాండ్ పెరిగింది.

బంగారం, వెండి ధరలు క్రిస్మస్, సంక్రాంతికి మరింతగా పెరిగిపోతాయేమోనన్న ఆందోళన ఉంది. ప్రస్తుత ధరలు వ్యాపారులకు లాభాలు తెస్తుండగా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారాయి. సంపన్నవర్గాలకు పెట్టుబడి సాధనంగా ఉంది.



శీతాకాలం ప్రారంభమైంది. ఉషోదయవేళ దారులన్నీ మంచు దుప్పటి కప్పుకుంటున్నాయి. సాయంత్రం వేళ శీతలగాలులు అంతర శరీరాన్ని కుదిపేస్తున్నాయి. దగ్గు, జలుబు పట్టిపీడిస్తున్నాయి. నవంబరు నెల నుంచి ఏటా జరిగే తంతే ఇదంతా. సమశీతోష్ణ స్థితికి అలవాటుపడిన శరీరానికి ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులను తట్టుకోవడం కాస్త ఇబ్బందికరమే. వీటి నుంచి గట్టెక్కేందుకు ఏకైక మార్గం స్వెట్టర్ ధరించడమే.

వెచ్చని నేస్తాలు







» ప్రజలను వణికిస్తున్న చలి » సాయంత్రం ఐదు గంటల నుంచే శీతలగాలులు » ఉన్ని దుస్తులకు పెరుగుతున్న డిమాండ్ » ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి విక్రయం

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

చలికాలం ప్రారంభమైంది. బయటకు రావడానికి భయపడేలా ప్రజలను చలి వణికిస్తోంది. వారం రోజులుగా చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. సాయంత్రం ఐదు గంటలకే చల్లటి గాలులు ప్రారంభమవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల దాకా మంచు దుప్పట్లు తొలగట్లేదు. పెరుగుతున్న చలితో వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు ఉన్ని దుస్తులను ధరించడం కంటే మరో మార్గం కనిపించట్లేదు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాకినాడ నగరంతో పాటు సామర్లకోట పట్టణంలో పలు ఉన్ని దుస్తుల దుకాణాలు వెలిశాయి. మధ్యప్రదేశ్, లూధియానా, సిమ్లా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ఉన్ని దుస్తులు తెచ్చి రహదారుల పక్కన విక్రయిస్తున్నారు. రగ్గులు, చలికోట్లు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజ్‌లు, మఫ్లర్లు, తలపాగాలు రకరకాల సైజుల్లో రంగు రంగుల్లో లభిస్తున్నాయి. ధరలు అధికంగా వున్నా చిన్నారులతో పాటు పెద్దలు కూడా వాటిని కొనుగోలు చేస్తున్నారు.



సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్ని దుస్తుల విక్రయం





మోడల్ మంకీ క్యాప్‌లు, హెడ్ బ్యాండ్‌లు



కాకినాడలో ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళ

ఎర్రజెండా ఒక్కటే రాజకీయ ప్రత్యామ్నాయం

» చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారు
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో దేశ, రాష్ట్ర ప్రజలకు ఎర్రజెండా ఒక్కటే రాజకీయ ప్రత్యామ్నాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను మోదీ ప్రభుత్వానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడానికి ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నోట్ల రద్దు సమయంలో ప్రధాని మోదీ రూపాయి విలువపై ఘనమైన ఉపన్యాసాలు ఇచ్చారని, కానీ డాలర్‌తో పోల్చితే దారుణంగా పడిపోయిందన్నారు. దీని ప్రభావం, శ్రామికజనంపై ఎంత భారం పడుతుందో పార్లమెంట్‌లో ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకూ రూ.150 లక్షల కోట్లు అప్పులు చేసి అప్పుల భారతాన్ని సృష్టిస్తున్నారని, దీన్నుంచి బయట పడడానికి కులం, మతం, ప్రాంత వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ అంటూ గొప్పలు చెబుతున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఒక్క పెన్షన్లు తప్ప ఏం సాధించారని, నిరుద్యోగ భృతి, మహిళకు ఆర్థిక సాయం, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై ఈ నెల 10న, వైద్య విద్య ప్రైవేటీకరణ నిరసిస్తూ 18న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. శతాబ్ది చరిత్ర నేపథ్యంలో 3,600 కమ్యూనిస్టు శాఖల్లో సీపీఐ ఆవిష్కరణ సభలు నిర్వహిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 5లక్షల మందిని సమీకరించి నూతన రాజకీయ ప్రత్యామ్నాయ దిశగా జనవరి 18న ఖమ్మంలో సీపీఐ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, పార్టీ పునర్వైభవం దిశగా, ప్రజలను భాగస్వాములు చేస్తూ, భవిష్యత్ పోరాటాలకు వేదిక చేసుకుంటామని ఈశ్వరయ్య పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్

» కొల్లాపూర్ శివాజీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సోంకవాడే
» నన్నయలో అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత్ సూపర్ పవర్ కలిగిన దేశమని కొల్లాపూర్ శివాజీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆర్‌జీ సోంకవాడే అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని రసాయనశాస్త్ర విభాగం, హైదరాబాద్‌లోని అయోంకి పబ్లిష్కో సంయుక్త ఆధ్వర్యంలో భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలు: వ్యవసాయ-ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్‌జీ సోంకవాడే ఆన్లైన్‌లో కీలక ఉపన్యాసం ఇచ్చారు. 67 శాతం యువత ఉన్న మన దేశంలో సాంకేతికపరమైన వినూత్న ఆలోచనలకు అవకాశాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఎలక్ట్రికల్ వాహనాలు ప్రమాదానికి గురికావడానికి యాంత్రిక ఒత్తిడి, ఉష్ణోగ్రత, తేమ, కలుషితాలు కారణమవుతున్నాయని చెప్పారు. ఉపయోగంలో లేని బ్యాటరీలను సరియైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని పర్యావరణ హితానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు దేశ విదేశాల నుంచి 300 మంది హాజరవుతున్నారని సదస్సు చైర్మన్, అయోంకి పబ్లిష్కో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ చంద్రమౌళి పావులూరి తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ఎస్.ప్రసన్నశ్రీ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికతలో వేగవంతమైన పురోగతులు, సహజ ప్రక్రియలపై అవగాహనను మరింత పెంపొందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. సదస్సుకు సంబంధించిన వంద పరిశోధన పత్రాలతో ముద్రించిన పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, సదస్సు కన్వీనర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి, రసాయన విభాగాధిపతి కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



వేంకటేశ్వరస్వామి అన్నదానానికి విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్య అన్నదాన పథకానికి నిడదవోలు మండలం పురుషోత్తపల్లికి చెందిన ముళ్లపూడి వెంకటసుబ్బారావు- లక్ష్మి రజని, ముళ్లపూడి శివరామకృష్ణ- సాయిశృతి దంపతులు రూ.5 లక్షలు విరాళం సమర్పించారు. దాతలకు ఆలయ ఉపకమిషనరు ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

గ్రంథాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు వర్మ



జిల్లా కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

కాకినాడ సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీఆర్ఎస్‌హెచ్ వర్మ పేర్కొన్నారు. కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన ఉద్యోగుల సంఘం రెండో కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘంలో చేర్చుకునేందుకు తీర్మానం చేశారు. అలాగే సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు రేపాక వెంకటరావు, ప్రధాన కార్యదర్శి డొక్కా రాజు, సలాది సాయి సత్యనారాయణ, ములంపాక శ్రీనివాసరావు, జీవీవీఎన్ త్రినాథ్, కె.కిషోర్, కె.శ్రీనివాస్, సలాది రాజు, కె.పద్మజ, బి.రత్నమణి, బి.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అక్నూ.. పీజీలో మిగిలిన సీట్లు

మేనేజ్‌మెంట్ కోటాలో భర్తీ

సర్పవరం జంక్షన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో మొదటి, రెండో కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లను మేనేజ్‌మెంట్ కోటా ద్వారా భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్లు భర్తీ చేసేందుకు ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనుమతి ఇచ్చిందన్నారు. దీనిలో సెట్ అర్హత లేని, ఏపీ పీజీ సెట్-2025 పరీక్ష రాయని అర్హులైన అభ్యర్థులతో సీట్లు భర్తీ చేస్తామన్నారు. మేనేజ్‌మెంట్ కోటా కింద ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ ఎకనామిక్స్, ఎంకామ్, ఎమ్మెస్సీ మ్యాథ్స్ కోర్సుల్లో సీట్లు భర్తీ చేస్తామన్నారు. వీరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించదన్నారు. ఇతర వివరాలకు 97018 27564 నెంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

భీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు

రూ.1.5 లక్షల విరాళం

ద్రాక్షారామ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఇద్దరు దాతలు రూ 1.5 లక్షలు విరాళం సమకూర్చారు. ద్రాక్షారామకు చెందిన యనమండ్ర భీమశంకరం, మాణిక్యాంబ దంపతులు రూ.1 లక్ష, శ్రీదర్భసూర్య సుబ్రహ్మణ్యం రూ.50 వేలు విరాళం ఆలయ సహాయ కమిషనర్ ఏవీ దుర్గాభవానీకి అందజేశారు. దాతలకు ఆమె స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

12న ఉమ్మడి జిల్లా కార్మికుల సదస్సు



ఉమ్మడి జిల్లా సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఏఐటీయూసీ అనుబంధ ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న కాకినాడ పీఆర్ భవన్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. గొల్లప్రోలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణదారుల నుంచి సెస్‌లు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఆ నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించడం లేదని విమర్శించారు. కోట్లాది రూపాయిల క్లెయిమ్ బకాయిలు పేరుకుపోయాయని తెలిపారు. ప్రమాదవశాత్తూ మృతిచెందిన భవన నిర్మాణ కార్మికులకు రూ.10 లక్షలు వంతున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిశెట్టి నూకరాజు, ఎం.గంగబాబు, చేదులూరి రత్నాజీ, మొగలి వరప్రసాద్, కోలా వీరబాబు, ఎస్.సత్తిబాబు, శ్రీను, నూకరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

'శంబాల..హర్రర్, సోషల్ ఫ్యాంటసీ సినిమా'



ఐఎస్‌టీఎస్‌లో సందడి చేస్తున్న సినీ నటులు

రాజానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హర్రర్, సోషల్ ఫ్యాంటసీ ఎలివేషన్లతో, మంచి కథతో శంబాల సినిమాగా మీ ముందుకు వస్తున్నామని హీరో ఆది అన్నారు. శంబాల మూవీ సినీ బృందం తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ కళాశాలకు శుక్రవారం విచ్చేసింది. వారికి కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వెళ్లి సినిమా చూసి ఆదరించాలని కోరారు. హీరోయిన్ అర్చన మాట్లాడుతూ ఈ నెల 25న శంబాల మూవీ విడుదల కాబోతుందని అందరూ తిలకించాలన్నారు. నటుడు ఇంద్రనీల్ ఈ సినిమాలోని డైలాగ్స్ చెప్తూ అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సినిమాలోని పలు పాటలకు స్టెప్పులు వేసి అలరించారు.

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖైదీల తరఫున కోర్టులో ఉచితంగా వాదించడానికి న్యాయవాదుల సేవలు అవసరమైనా, బెయిల్ పిటిషన్లు దాఖలు, హైకోర్టుల్లో అప్పీలు వేయాల్సి ఉన్నా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకరిస్తుందని సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి స్పష్టం చేశారు. శుక్రవారం సెంట్రల్ జైలును ఆమె సందర్శించారు. ఆహార ప్రమాణాలు, వైద్య సేవలను, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి న్యాయ సహాయం గురించి వివరించారు. నిందితులు, ఖైదీల న్యాయ పరిరక్షణ కోసం పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు.

నేడు సామర్లకోటకు

సమాచార శాఖ కమిషనర్

సామర్లకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ చావలి సునీల్ శనివారం కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని డీఆర్వో జె.వెంకట్రావు శుక్రవారం రాత్రి తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఈవో బళ్ల నీలకంఠం, పండితులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

చెస్‌లో రవిశంకర్ ప్రతిభ

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆలిండియా చెస్ రేటింగ్స్‌లో రాజమహేంద్రవరానికి చెందిన వనం రవిశంకర్ 1506 ర్యాంకు సాధించాడని కోచ్ వరద సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ కుమారుడు సురేష్ చెస్ అకాడమీలో ఆరు నెలలుగా శిక్షణ పొందుతున్నాడని రవిశంకర్ తల్లిదండ్రులు తెలిపారు.

గాలికొదిలేశారు!

- మన్యంలో నీరుగారిన సత్యసాయి ఆశయం
- నిర్వహణా లోపంతో సత్యసాయి రక్షిత మంచినీటి పథకం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కేవలం 66 గ్రామాలకే అందుతున్న తాగునీరు



కుట్రవాడలో సత్యసాయి మంచినీటి పథకం (ఫైల్‌ఫొటో)



ప్రస్తుతం కళతప్పిన సత్యసాయి మంచినీటి పథకం

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

మన్యంలో గిరిజనుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు రక్షిత మంచినీటిని ప్రసాదించిన భగవాన్ సత్యసాయి ఆశయాలను గత కొన్నేళ్లుగా అధికారులు నీరుగారిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గిరిజన ప్రాంతాలు, పలు గ్రామీణ ప్రాంతాల్లోనూ రక్షిత మంచినీరు లేక ప్రజలు అనేక రోగాల బారినపడి ప్రాణాలను కోల్పోయే దుస్థితి ఉండేది. ఆ పరిస్థితులను తెలుసుకున్న భగవాన్ సత్యసాయి ఇక్కడి ప్రజలకు రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటు చేయాలని నిశ్చయించిందే తడవుగా గోదావరి జలాల ఆధారిత పథకాన్ని పురుషోత్తపట్నంలో, పాములేరు ఆధారిత పథకాన్ని మారేడుమిల్లి మండలం కుట్రవాడలోనూ ఏర్పాటు చేసి 9 మండలాల్లో 212 గ్రామాల్లోని 2.20 లక్షల ప్రజల కోసం రక్షిత మంచినీటి సరఫరా అందించారు. 212 గ్రామాలకు ఈ రక్షిత మంచినీరు అందేవిధంగా సుమారు 550 కిలో మీటర్ల నిడివిన పైపులైన్లను నిర్మించి ఈ పథకాలను 2007 సెప్టెంబరులో ప్రభుత్వానికి సత్యసాయి సేవా సంస్థ అప్పగించింది. అప్పటిలో ఈ పథకాలను ఎల్‌అండ్‌టీ సంస్థే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది.

మొక్కుబడిగా...

కాగా సత్యసాయి జీవించి ఉన్నంతకాలం ఎంతో ప్రతిష్టాత్మకంగా నడిచిన ఈ పథకాల పట్ల తదనంతర కాలంలో ఆయా అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో ప్రస్తుతం కేవలం 66 గ్రామాలకే మొక్కుబడిగా తాగునీరు అందుతోంది. అది కూడా గతంలో మాదిరిగా శుద్ధికావడం లేదు. గిరిజనుల అభివృద్ధిని కాంక్షించే ఐటీడీఏ పూర్తిగా దీనిని పట్టించుకోవడం మానేసింది. వాగునీటిని క్లోరినేషన్, ఆలమ్, బ్లీచింగ్ మిశ్రమాలతో సక్రమంగా శుద్ధి చేసి లేబరేటరీలో పరీక్షించి మరీ నీటిని సరఫరా చేసే పద్ధతులు ప్రస్తుతం సక్రమంగా కొనసాగడం లేదు. కనీసం పథకాల భవనాలకు రంగులు కూడా వేయని దుస్థితి నడుస్తోంది. జిల్లా పరిషత్‌కు ఇష్టమైతే ఎవరో కాంట్రాక్టర్‌కు నిర్వహణ అప్పగించి ఊరుకోవడం మినహా ఇంతటి ఉత్తమ పథకాలను పరిరక్షించే చర్యలేవీ ఎవరూ తీసుకోవడం లేదు. సత్యసాయి ఆధ్యాత్మిక సేవలనే కాకుండా సమాజానికి హితమైన సేవలను అందించారంటూ ప్రత్యేక సమావేశాలు, ఉత్సవాలను నిర్వహించి కొనియాడే ఈ సందర్భంలోనైనా ఈ రక్షిత మంచినీటి పథకాలను పునరుద్ధరించే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యన్నదాన పథకానికి శుక్రవారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. నిడదవోలుకు చెందిన మంత్రప్రగడ నాగేశ్వరరావు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.

జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో రోలర్ స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్న రాయుడు అశ్విక అండర్-11 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు జిల్లా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు రుద్ర వైకుంఠరావు తెలిపారు. స్టేడియం కోచ్ కె. సంపత్‌కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారని కొనియాడారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అశ్విక ప్రతిభ చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కాగా అండర్-17 విభాగంలో కె.కుమార్, చందు శ్రీధర్ రజత పతకాన్ని దక్కించుకున్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. రోలర్ స్కేటింగ్ క్లబ్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఆర్.గిరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, కె.నరసింహమూర్తి, క్లబ్ సభ్యులు ఎస్.ప్రవీణ్, పీవీ సత్యనారాయణ, ఎస్.చిరంజీవి, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వైకుంఠరావు

పనులు వేగంగా పూర్తి చేయాలి

అన్నవరం దేవస్థానంలో సౌకర్యాల మెరుగుకు ప్రత్యేక సమావేశం

కలెక్టర్ కార్యాలయానికి రావాలని అధికారులకు ఆదేశం

సత్యదేవుడిని కుటుంబసభ్యులతో దర్శించిన కాకినాడ జిల్లా కలెక్టర్



అన్నవరం దేవస్థానం ఈవో, ఈఈలతో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో భక్తుల అసంతృప్తి శాతం తగ్గించడం, మెరుగైన సౌకర్యాలక కల్పనకు ఏమి చేయాలనేదానిపై ఒకట్రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేద్దామని... ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఈవో ఇతర ముఖ్య అధికారులు కలెక్టర్ కార్యాలయానికి రావాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులతో సత్యదేవుడిని ఆయన దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఐవీఆర్‌ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం స్థానం నానాటికీ పడిపోతుందని ప్రత్యేక కార్యచరణ రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనం తరం దేవస్థానంలో ప్రసాద్‌స్కీం పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అన్నప్రసాద భవనం ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించగా ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. భక్తుల కోసం తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్ల ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని అన్నదాన భవనం నిర్మా ణం, మరుగుదొడ్ల ఏర్పాటు స్థలం చాలా దూరం కావడంతో మరోపక్క ఈ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ఈవో సుబ్బారావు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులువేదాశీర్వచనం అందించారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్ దంపతులు

రైల్వేస్టేషన్లలో చోరీలు చేస్తున్న ఇద్దరి అరెస్ట్

13.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, రూ.45వేల నగదు స్వాధీనం

తుని రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుని జీఆర్పీ పోలీసులు ప్రత్యేక రైడ్ నిర్వహించి పట్టుకున్నారు. కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ 1వ నెంబరు ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న సేనాపతుల మనీష్, గుత్తుల వీరబాబును అదుపులోకి తీసుకున్నామని తుని రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. విచారణ అనంతరం వారి నుంచి మోటార్‌సైకిల్, 13.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 సెల్‌ఫోన్లు, రూ.45వేల నగదు స్వాధీనపరుచుకున్నారు.

నిందితులతో తుని రైల్వే పోలీసులు



అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



సత్యనారాయణ(ఫైల్)

ఆత్రేయపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా అదృశ్యమైన వ్యక్తి గోదావరిలో శవమై కనిపించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పులిదిండికి చెందిన వల్లి సత్యనారాయణ(60) గతనెల 27న ఎవ్వరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో సత్యనారాయణ మనువడు చక్రి గతనెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిర్వహించారు. శుక్రవారం పేరవరం వద్ద గౌతమి గోదావరి నదీలో సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు వెళ్లి విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాము పేర్కొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వ్యక్తులపై కేసు

జగ్గంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన పలువురిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్టు జగ్గంపేట ఎస్సై టి.రఘునాధరావు తెలిపారు. గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ, డిగ్రీ కళాశాల సమీపంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురుని అదుపులోకి తీసుకున్నామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఉపేక్షించేదిలేదని, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డివాములో మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

కపిలేశ్వరపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలంలోని వాకతిప్ప గ్రామశివారులో గురువారం రాత్రి గడ్డివాములో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... వాకతిప్ప గ్రామశివారులో గడ్డివాము వద్ద గుర్తు తెలియని పురుష మృతదేహం ఉన్నట్టు తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ ప్రాంతాన్ని సిబ్బందితో పరిశీలించినట్టు తెలిపారు. దీనిపై పక్క మండలాలకు సమాచారం ఇవ్వగా రామచంద్రపురం గ్రామానికి చెందిన గుబ్బల రమణ(59)గా గుర్తించారు. మృతుడు రామచంద్రపురంలోని ఓ ప్రైవేటు కాలేజీ నందు బస్సు క్లీనర్‌గా పనిచేసేవాడు. బస్సు కోరుమిల్లి గ్రామంలో ఉంచి అక్కడే నిద్రించేవాడు. గతనెల 27 నుంచి కనపించడంలేదు. అతడి చుట్టుపక్కల గాలించిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం రాత్రి గ్రామశివారులో డి.మణికంఠ పొలం గడ్డివాము దగ్గర రమణ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి బావమర్ది గుత్తుల శ్యామ్ మృతదేహాన్ని రమణగా గుర్తించాడు. అనంతరం పోలీసులు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపారు.

బాలికకు వేధింపులు...

ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు

రాజోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలికను వేధించిన కేసులో ఐదుగురు వ్యక్తులపై పోక్సో కేసు నమోదు చేశామని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ గత పదేళ్లగా తాటిపాకలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తుంది. ఆమెకు బాలిక ఉంది. అయితే ఆ మహిళతో రాజోలుకు చెందిన జీడీ ప్రసాద్ సహజీవనం చేస్తున్నాడు. ప్రసాద్ సదరు మహిళ కూతురి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో ప్రసాద్‌కు వారు దూరంగా ఉంటున్నారు. గత నవంబరు 2న ప్రసాద్ తన స్నేహితులైన సీహెచ్ రాంబాబు, కె.బాబి, ఎస్.అరుణ్‌తేజ, రామాంజనేయును వెంట తీసుకుని మహిళ ఇంటికి వెళ్లి బెదిరింపులకు గురిచేశారు. దీంతో ఆమె రాజోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఐదుగురిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు.

కులాన్ని మార్చేశారు...

కాకినాడకు చెందిన కానిస్టేబుల్ ఫిర్యాదు

కాకినాడ క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో తన కులాన్నే మార్చేశారని ఓ కానిస్టేబుల్ కలెక్టర్, డీఆర్వోలకు ఫిర్యాదు చేశాడు. వివరాలోకి వెళ్లితే కాకినాడకు చెందిన జగదీష్ అనే కానిస్టేబుల్ తన కులాన్ని ఆన్‌లైన్‌లో కుట్రపూరితంగా మార్చేశారని అధికారులకు ఫిర్యాదు చేశాడు. డిఐజీ సంతకాన్ని ఫోర్జరీ చేసి సస్పెన్షన్‌కు గురైన జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కామేశ్వరరావు కాకినాడ 32 ఏ సచివాలయ మహిళా వీఆర్వోతో కలిసి ఈ కుట్రకు పాల్పడ్డారని జగదీష్ ఆరోపించాడు. బీసీ కులస్తుడిగా ఉన్న తనను ఓసీ కులస్తుడిగా మార్చి తన ఉనికిని ప్రశ్నార్థకం చేశారని వాపోయాడు. సుమోటా కేస్ట్ సర్వేలో భాగంగా కుల పరిశీలన చేస్తున్న నేపథ్యంలో అదే అవకాశంగా సర్వేలో లొసుగులు వినియోగించుకుని తన కులాన్ని మార్చినట్టు పేర్కొన్నాడు. ఓటీపీ వస్తుందని ముందుగానే తెలిసి తొలుత తన ఫోన్ నెంబర్ మార్చి ఆపై కులం పేరు మార్చారన్నాడు. రెవెన్యూశాఖ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి తక్షణం విచారణ చేపట్టాలని, తన కులాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించాడు. నేరానికి పాల్పడిన కామేశ్వరరావుతో పాటు సహకరించిన మహిళా వీఆర్వోపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరాడు.

సూక్ష్మ సింబల్... సూపర్!



అమలాపురం టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు నేరుగా అందజేసేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సూక్ష్మాతి సూక్ష్మ వస్తువుల తయారీ నిపుణుడు తాలాబత్తుల బ్రహ్మాజీ గ్లాసు గుర్తుపై పార్టీ సింబల్‌ను సూక్ష్మంగా తయారుచేశాడు. రోజు వ్యవధిలో 0.550 మిల్లీగ్రాముల వెండిని ఉపయోగించి సెంటీమీటరు ఎత్తు, 0.75 సెంటీమీటర్ల వెడల్పుతో సింబల్‌ను తయారుచేసినట్టు బ్రహ్మాజీ తెలిపారు. పార్టీ సింబల్‌పై జెండాను సైతం సూక్ష్మంగా చెక్కారు. త్వరలో పవన్‌ను కలిసి సూక్ష్మ వస్తువును అందజేయనున్నట్టు తెలిపారు. బ్రహ్మాజీ ఇప్పటికే 37 సూక్ష్మ వస్తువులనుచేసి జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పలు అవార్డులు, రికార్డులు దక్కించుకున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలకు యత్నం

లంకల గన్నవరంలో రెండు ఎక్స్‌కవేటర్లు, రెండు లారీలు స్వాధీనం



పి.గన్నవరం పోలీస్‌స్టేషన్ వద్ద రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, చట్రులారీ



పి.గన్నవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు కాలం ముగియడంతో తీరం వెంబడి ఇసుక, మట్టి తవ్వకాల కోసం మాఫీయా సిద్ధమవుతుంది. ఈ క్రమంలోనే డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైవి పాలెం దిగువన లంకల గన్నవరం పరిధిలో ఇసుక తవ్వకాలు నిమిత్తం ర్యాంపు ఏర్పాటుకు కొంతమంది మాఫీయా పెద్దలు శుక్రవారం రంగం సిద్ధం చేసుకుని బాట పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పి.శ్రీపల్లవి రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో ఆర్‌ఐ డాంగే, సిబ్బంది బాట పనుల వద్దకు చేరుకుని రెండు ఎక్స్‌కవేటర్లు, చట్రుతో వచ్చిన 2 లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం యంత్రాలను పోలీసులకు అప్పగించామని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ స్పష్టం చేశారు. అలాగే మొండెపులంకలో రాత్రివేళల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా ఇసుక తవ్వకాలకు తమకు అనుమతులు ఉన్నాయని విజయవాడ నుంచి రాము పంపించారని బాట పనులు వద్ద ఉన్న కొంతమంది నిర్వహ కులు ఆర్‌ఐకు సూచించారు. దీంతో గోదావరి తీరాన్న పెద్దఎత్తున ఇసుకను తరలించేందుకు మాఫీమా పెద్దలు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తుంది. అలాగే రాత్రి వేళల్లో అనుమతులు లేకుండా లంకలగన్నవరంలో బొండుఇసుక, మొండెపులంకలో ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. వారం వ్యవధిలో పోలీసులు 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని జరిమానా విధించి పంపివేశారు.

కాకినాడలో 104 ఉద్యోగుల ఆందోళన



కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న 104 ఉద్యోగులు

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 104 నిర్వహణ సంస్థ భవ్య యాజమాన్యం చట్టవ్యతిరేకంగా ఇచ్చిన షోకాజ్ నోటీస్‌ను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాత్రి కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ పిఠాపురం మండలం మల్లం పీహెచ్‌సి పరిధిలోని 104 వాహనంలో గత 6 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న రాంబాబును భవ్య యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా విధులకు సంబంధంలేని అంశాలపై ఆరోపణలు చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం కార్మిక చట్టాలకు విరుద్ధమని విమర్శించారు. భవ్య సంస్థ వచ్చాక వేతనాలను తగ్గించారని ఆరోపించారు. 104 వాహనాలు పూర్తిస్థాయిలో తిరగకపోయినా తిరుగుతున్నట్టు చూపించి ప్రభుత్వ నిధులు దోచుకుంటున్నారన్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి భవ్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకి యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రత్నరాజు,చీకట్ల శ్రీనివాస్ మద్దతు తెలిపారు.



వర్ణాల చిత్రం సూర్యోదయం వేళ ఆకాశం రంగుల వర్ణమైంది.. అందాల శోభ సంతరించుకుంది. కాకినాడ-పండూరు రహదారిపై కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా.. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కాకినాడ

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

నీటి సంఘు సభ్యుల సమావేశం

బిక్కవోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు ఇరిగేషన్ కార్యాలయంలో శుక్రవారం నీటి సంఘు సభ్యుల సమావేశం ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రైతుల సమస్యలు, రబీ సాగుపై చర్చించారు. ఇరిగేషన్ అధికారులు రైతులు పాల్గొన్నారు.



గోకవరం జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

ప్రైవేట్‌కు దీటుగా బోధన

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు
- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- పలుచోట్ల మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం



పందలపాక జడ్పీ హైస్కూల్ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

గోకవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బోధించేటట్టు ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని 53 ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(పీటీఎం) జరిగింది. ఈ సందర్భంగా గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నెహ్రూ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పిల్లలు ప్రగతి, వారి నడవడిక, బంగారు భవిష్యత్తుకు ఏం చేస్తే బాగుంటుందని అధ్యాపకులను, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. ఎక్కడా ఉపాధ్యాయుల కొరత లేకుండా ఏటా డీఎస్సీ నిర్వహించేందుకు కృషి చేస్తున్నారన్నారు. పిల్లలను ప్రవేట్ పాఠశాలల్లో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా భరత్, కన్నబాబు, పిల్లా చంటిబాబు, గాజింగం సత్తిబాబు, ఉంగరాల రాము, దాసరి తమ్మన్నదొర, గళ్లా రాము, మంగరౌతు రాము, ఎస్వీఎస్ అప్పలరాజు, కోట సత్యవతి, డీవీఈవో డి.విజయశ్రీ, ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులు దిక్సూచి: గోరంట్ల

ధవళేశ్వరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో సమావేశానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థుల ప్రగతి, ప్రభుత్వ పథకాల అమలు, క్రమం తప్పకుండా వైద్య పరీక్షల నిర్వహణ, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని, విద్యాబోధనను మెరుగు పరచడానికి మంత్రి లోకేశ్ సూచనలతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దిక్సూచిగా ఉంటే విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. నాసా నెహ్రూ ప్లానిటోరియం సంయుక్తంగా నిర్వహించిన అంతరిక్ష విజ్ఞాన పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కె.జెస్సీని ఎమ్మెల్యే గోరంట్ల అభినందించారు. శాటిలైట్ సిటీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మున్నా ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఏఎస్పీ మురళీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిలో గురువుతో పాటు తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమన్నారు. ఆయా సమావేశాల్లో ఎంఈవోలు కిరణ్‌చందు, తులసిదాస్, ఎంపీడీవో సునీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, విద్యా కమిటీ చైర్మన్ పల్లా భవాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి: ఎంపీపీ

కడియం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కడియం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.తస్యనారాయణ అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాధవరాయుడుపాలెం హైస్కూల్లో హెచ్ఎం జి.ప్రమీలారాణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి సర్పంచ్ అన్నందేవుల చంటి ముఖ్య అతిథిగా విచ్చేయగా ఆయనను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సత్కరించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాకిట్లు అందజేశారు. ఆయా సమావేశాల్లో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, బీజేపీ మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం, వనుం సూరిబాబు, చిలుకూరి ప్రభ, గుత్తుల కిషోర్, చిలుకూరి సుబ్బరాజు, ఉండమట్ల ప్రభాకర్, దామిశెట్టి నాగరాజు, తహశీల్దారు సునీల్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో శ్యాంబాబు, ఎస్ఐ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వారధి

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్రనగర్ మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డేనియల్ బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి టీడీపీ 4వ వార్డు ఇన్‌చార్జి నక్కా చిట్టిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మధ్య వారధిలా మెగా పీటీఎంలు ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పించడం, విద్యార్థుల సంఖ్య పెంచడంలో సహకరించిన పూర్వ విద్యార్థి బళ్లా శ్రీనివాసరావును ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, గూటాల సంజీవరావు, కొండిశెట్టి రామకృష్ణ, గుత్తుల రమేష్, అల్లంకి మణికంఠ తదితరులు పాల్గొన్నారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి వచ్చిన తల్లిదండ్రులకు.. విద్యార్థినుల ప్రగతి, హాజరు, పరీక్షా ఫలితాలు, అభివృద్ధి అవసరాలపై స్పష్టమైన వివరణ ఇచ్చారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రభలవల్లి మాట్లాడుతూ, కళాశాల పరిపాలన, విద్యావిధానం, విద్యార్థుల భద్రత, భవిష్యత్ కార్యాచరణపై తల్లిదండ్రులకు సమగ్రంగా వివరించారు. వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం తల్లిదండ్రులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

విద్యా వ్యవస్థలో సంస్కరణలు: నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచి ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో మంత్రి లోకేశ్ విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సమన్వయపరచి పిల్లల్ని అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో నాయకులు పడాల సూర్యనారాయణరెడ్డి, సబ్బారపు సూర్యనారాయణ, కర్రి శ్రీనివాసరావు, పీవీ రామారెడ్డి, ఎస్‌డీసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఇందల వీరబాబు, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ, హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే రంగాపురంలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో కూటమి నాయకులు పాల్గొని విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందజేసారు. కానాటి అప్పలస్వామి, కనుమూరి సాయిరాజు, నడింపల్లి చిరంజీవిరాజు, ఎంపీటీసీ కేతీ ఏసురత్నం, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్వీ లక్ష్మణరావు పాల్గొన్నారు. ఇళ్లపల్లి హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఎంపీపీ తేతలి సుమ, తనుకు శ్రీధర్, కన్నీరు రాఘవ, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. బిక్కవోలు హైఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎం సభలో కూటమి నేతలు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, బేరా వేణమ్మ, హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు. బలభద్రపురం ఉన్నత పాఠశాలలో సొసైటి చైర్మన్ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ బుంగా రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు: బత్తుల

కోరుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కోరుకొండ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తెస్తోందన్నారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం, కిట్లు పంపిణీ, తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు జమ వంటివి చేసిందని, పరీక్షల్లో ఉత్తమమైన ఫలితాలు కనబరిచిన వారిని గుర్తించి షైనింగ్ అవార్డులు పేరిట సత్కరించారన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం నెలకొల్పడానికి మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.పిల్లల ప్రగతి, ప్రభుత్వం విద్యాపరంగా చేస్తున్న కార్యక్రమాలను తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ పటిష్టం: వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక నాగరాజ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యావ్యవస్థను ప్రభుత్వం మరింత పటిష్టం చేసిందని, ఉచిత విద్యను పేద, మధ్యతరగతి వర్గాలు అందిపుచ్చుకుని ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో సెల్ఫీలు దిగారు. వారితో కూర్చొని భోజనాలు చేశారు. తొలుత నాగరాజ పాఠశాలలో చదువుకుని టీచర్‌గా డీఎస్సీ-2025 లో కొలువు సాధించి స్థానిక ఊటలంక కార్పొరేషన్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరిన ఎల్.త్రివేణి ఎమ్మెల్యే సత్కరించారు. అలాగే తమ పాఠశాల పూర్వ విద్యార్థిని పొడుగు లక్ష్మి టౌన్ మున్సిపల్ స్కూల్లో ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారని హెచ్ఎం టి.చక్రధర్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీరభద్రపురంలోని టౌన్ హైస్కూల్లో జరిగిన మీటింగ్‌కు మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థి దశలో తల్లిదండ్రుల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత పెంచేందుకు, విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయడానికి ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందిస్తామన్నారు.

రంగంపేట: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం నిర్వహించినట్టు విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు తెలిపారు. ప్రభుత్వ విద్యా పథకాల ప్రదర్శన, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతి నివేదికలు ప్రధానోపాధ్యాయులు చదివి వినిపించారని, ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో గెలిపొందిన వారికి బహుమతులు అందించినట్టు చెప్పారు. సమావేశాల్లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ ఎలుగుబంటి సత్తిబాబు, ఎంపీడీవో వీవీ సాయిబాబు, పీహెచ్‌సీ డాక్టర్ బి.వేణుశ్రీలక్ష్మీ, ఉపాధి ఏపీవో శేషవాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణ అంజలి పాల్గొన్నారు. సందర్భంగా రంగంపేట హైస్కూల్లో కొత్తగా వచ్చిన హిందీ ఉపాధ్యాయులు పుష్పలత, విజయలక్ష్మీ, డీఎస్సీలో ఎన్నికైన గారపాటి భారతి, పడాల వీరబాబులను హెచ్ఎం పార్థసారధి ఆధ్వర్యంలో సత్కరించారు. లక్కీడిప్ నిర్వహించి ఇద్దరు తల్లిదండ్రులకు బహుమతులు అందించారు.బాల్య వివాహాల నిరోధంపై సామూహికంగా ప్రతిజ్ఞ చేయించారు.

అనపర్తి: అనపర్తిలోని బాలుర హైస్కూల్లో జరిగిన సమావేశానికి నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇటీవల జరిగిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థి జీవీవీ సతీష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి,తహశీల్దార్ అనిల్‌కుమార్, డీసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి పాల్గొన్నారు. ముఖ్య అతిథులతో పాటు అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. బాలికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అలాగే రామవరం, పొలమూరు, కుతుకులూరు, పులుగుర్త పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమాలు నిర్వహించారు.

రాజానగరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం నిర్వహించారు. ఈ సందర్భంగా లాలాచెరువు హైస్కూల్‌ను ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ సందర్శించారు. ఉపాధ్యాయులు.. పాఠశాల, విద్యాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. అనంతరం ఆర్డీవో పాఠశాల విద్యాప్రమాణాలు, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అలాగే మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో ఎంఈవోలు ఎం.రామన్నదొర, జ్యోతి ప్రసాద్ పాల్గొని ఆయా పాఠశాలల ప్రగతిని వివరించారు.కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, విద్యా కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.



ఎంఆర్ పాలెంలో సర్పంచ్ చంటిని సత్కరిస్తున్న దృశ్యం



ధవళేశ్వరంలో విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



కోరుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల



రాజమహేంద్రవరంలోఎస్‌కేవీటీ పాఠశాల వద్ద స్వాగత బోర్డులు



రాజానగరంలో ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

బొమ్మూరులో అగ్నిమాపక కేంద్రం

- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.25 కోట్లతో నిర్మాణం
- శంకుస్థాపనలో ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.25 కోట్ల వ్యయంతో బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో అత్యాధునిక అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని బొమ్మూరులో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బొమ్మూరులో అగ్నిమాపక కేంద్రం నిర్మిస్తున్నామని, పైఅంతస్తులో అగ్నిమాపక శాఖ జిల్లా కార్యాలయాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలు, యంత్రాలను సమకూర్చుతున్నామన్నారు.కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.మార్టిన్ లూథర్‌కింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు 50 మందికి ఎమ్మెల్యే గోరంట్ల దోమతెరలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో గిరిజన, బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉండే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా 200 దోమతెరలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మెనూ అమలుపై ఆరా తీశారు. చదువులో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ మండలంలోని స్త్రీశిశు సంక్షేమ శాఖ నిధులతో బీసీ విద్యార్థులకు 100, గిరిజన విద్యార్థులకు 50, సాంఘిక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు 50 దోమతెరలను అందజేస్తున్నట్టు తెలిపారు.సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి స్వీయ నిధులు రూ.10 వేలతో గిన్నెలను విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిడింగొయ్యిలో మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం నిర్వహణలో భాగంగా శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల యూనిట్ 2 వలంటీర్లు రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామ పరిసరాలు, ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, ఎన్ఎస్ఎస్ పీవో హెచ్.శ్రీరామ్ పవన్, గ్రామ పెద్దలు, హైస్కూల్ హెచ్ఎం సుజాత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాడతాం

ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్నకుల వీరాంజనేయులు

రంగంపేట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో సీపీ రెడ్డి నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, మౌలిక వసతులు కల్పించే వరకూ పోరాడుతామని ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్నకుల వీరాంజనేయులు అన్నారు. శుక్రవారం సీపీ రెడ్డి నగర్‌లో ఏపీ రైతు కూలీ సం ఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టాలు మంజూరు చేసి, రోడ్డులు, డ్రైనేజీలు, మౌలిక వసతులను కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, కమిటీ సభ్యులు ఎల్లే సత్తిబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మడికి సత్యం, పీడీఎస్‌యూ నాయకులు రెడ్డి దుర్గాదేవి, చెక్క సత్తిబాబు,దంగేటి రత్నం,నల్ల లక్ష్మీ, సూర్యారావు, రాయుడు కన్నా పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు అన్నారు. ఈమేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకులు ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఘటనలకు ఏం సమాధానం చెబుతారన్నారు. ప్రతిరోజూ గంజాయి అక్రమ రవాణా జరుగుతోందని, హైస్కూల్ పిల్లల నుంచి పీజీ, ఇంజనీరింగ్ యువత వరకూ గంజాయి చేరుతోందంటే ఈ మాఫియాకు ఉన్న నెట్‌వర్కు ఎంత బలంగా ఉందో అర్థమవుతోందని అన్నారు. తక్షణమే గంజాయి మాఫియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేయాలని డిమాండ్ చేశారు.

రాజమహేంద్రవరం అభివృద్ధికి కృషి

నగరంలో గుంతలన్నీ పూడిపిస్తున్నాం.. బీటీ రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాము ఏం చేసినా రాజమహేంద్రవరం అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు కోసమేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 7వ డివిజన్‌లో రూ.30 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రోడ్డు, గోరక్షణపేట, శీలం నూకరాజు రోడ్డు మీదుగా షెల్టాన్ హోటల్‌కు ఇవతల వైపు పెట్రోల్ బంకు వరకు డ్రైన్ చాలా ముఖ్యమైనదని, ఆవకు వెళ్లే కీలక డ్రైన్ 60, 70 ఏళ్ల క్రితం వేశారని,అది లీకేజీ కారణంగా ఇబ్బంది రావడంతో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వేశామని పేర్కొన్నారు. దీని పనుల వల్ల రోడ్డు నిర్మాణం పనులు ఆలస్యమైందన్నారు. ఏవీఏ రోడ్డు రామాలయం జంక్షన్ నుంచి ఎస్పీ ఆఫీసు వరకు, క్వారీ సెంటర్-లాలాచెరువు రోడ్డు, 12వ వార్డు సోమాలమ్మ టెంపుల్ రోడ్డు, టీటీడీ కళ్యాణ మండపం రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచామని వారం రోజుల్లో గుంతలు పూడ్చే పనులు చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పుష్కరాల నాటికి శానిటేషన్ ఉద్యోగాలు భర్తీ చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల నాటికి కొత్త శానిటేషన్ ఉద్యోగాలు భర్తీ చేయాలని, మున్సిపల్ కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ వరకూ నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ 1వ వార్డు మస్తర్ సెంటర్ నుంచి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రెడ్డి రమణ, కార్యదర్శి అల్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక కృషి : నల్లమిల్లి

అనపర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో రూ.40 లక్షలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్రధాన మంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా పథకం ద్వారా రూ.23.10లక్షల నిధులతో నిర్మించిన లైబ్రరీ భవనం, రూ.7.16 లక్షలతో ఏర్పాటు చేసిన పీఏఎల్ ల్యాబ్‌ను, ఐటీసీ, 1977-78 పూర్వ విద్యార్థులు సమకూర్చిన నిధులు రూ.9 లక్షలతో నిర్మించిన ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు.కార్యక్రమంలో ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి, ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, హెచ్ఎం కర్రి కళ్యాణి, కమిటీ చైర్‌పర్సన్ నల్లమిల్లి విజయలక్ష్మి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

వృద్ధులకు వాకర్స్ క్లబ్ పింఛన్లు

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలోని ఆనంద గార్డెన్స్‌లో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే నగరంలోని దేవస్థానాలకు నూతన డైరెక్టర్లుగా నియమితులైన వారికి సంస్థ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు, క్లబ్ కార్యదర్శి గుబ్బల గంగాభవాని, దాత తోట కిరణ్ మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాలుగా వృద్ధులకు పింఛన్లు సంస్థ అందిస్తోందన్నారు. ఈ ఒక్కొక్కరికి రూ.500 చొప్పున 85మందికి రూ 42,500 అందజేశారు. వాసంశెట్టి వరలక్ష్మి జ్ఞాపకార్థం అన్నదాన వితరణ చేశారు. మార్కండేయస్వామి, కోటిలింగేశ్వర స్వామి దేవస్థానాల డైరెక్టర్లుగా నియమితులైన శనపతి సత్తిబాబు, తోట కిరణ్, గుబ్బల గంగాభవానీలను క్లబ్ సభ్యులు సన్మానించారు. పామర్తి గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

జీజీయూలో ప్రపంచ నేల దినోత్సవం

రాజానగరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవడంతో పాటు ఖర్చులను తగ్గించుకోవచ్చని జీజీయూ వ్యవసాయ విభాగాధిపతి బలరాం భరత్ అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా జీజీయూ లోని వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని చక్రద్వారబంధం, శ్రీకృష్ణపట్నం గ్రామాల్లో నేల ఆరోగ్యం, భూసార పరిరక్షణ, స్థిరమైన వ్యవసాయం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. వాతావరణ మార్పులు, వ్యవసాయంపై చూపుతున్న ప్రభావం నేపథ్యంలో నేల ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకమని వివరించారు. కార్యక్రమంలో జీజీయూ వ్యవసాయ విభాగాధిపతి బలరాం భగత్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఎల్ థీమ్ సాంగ్ విడుదల

రాజానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి థీమ్ సాంగ్‌ను బెంగుళూరులోని వైదేహి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ చైర్‌పర్సన్ డాక్టర్ డీఏ కల్పజ శుక్రవారం విడుదల చేశారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి పాటను ఆవిష్కరించారు. ఈ పాటను రాంభట్ల నర్సింహశర్మ రచించగా, ధనుంజయ్, సాహితి గానం చేయగా, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ స్వరపరిచారు.ఈ సందర్భంగా జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థలు అందిస్తున్న సేవలు, సాధించిన ప్రగతిని పలువురు కొనియాడారు. దీనిలో భాగంగా మాధవపెద్ది సురేష్‌తో పాటు కల్పజను జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డైరెక్టర్ సందీప్ సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.కార్యక్రమంలో అమెరికాకు చెందిన మత్తు విభాగ డాక్టర్లు వీఆర్ కరుపతి,రాభట్, మహేష్, జీఎస్ఎల్ ప్రిన్సిపాల్ గురునాథ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్టు

సీతానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పురుషోత్తపట్నం శివారున గంజాయి తరలిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు సిబ్బందితో పురుషోత్తపట్నం శివారున దాడి చేసి గంజాయి తరలిస్తున్న మహారాష్ట్ర ఔరంగాబాద్‌కు చెందిన యాభై ఏళ్ల హబీబా ఖాన్‌ను అరెస్టు చేసి, ఆమె నుంచి 7 కిలోల గంజాయి స్వాధీనం చేసకున్నామన్నారు. గంజాయి విలువ రూ.3.5 లక్షలు ఉంటుందని తెలిపారు.

మీ డబ్బు-మీ హక్కుపై అవగాహన సదస్సు

కోరుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని డిపాజిట్లు, ఆస్తులను సమర్థవంతంగా, త్వరగా పరిష్కరించే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రారంభించిన మీ డబ్బు మీ హక్కు కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు శనివారం కొరుకొండలోని ఆదిత్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమక్షంలో గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్యాంకులు, పోస్టాఫీసులు వంటి ఆర్థిక సంస్థల్లో సంవత్సరాల తరబడి క్లెయిమ్ చేయకుండా ఉన్న డిపాజిట్లు, ఖాతాలను యజమానులకు చేరవేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ప్రతి ఒక్కరూ తమ డబ్బు హక్కును తెలుసుకోవాలన్నారు.





ఒకప్పుడు నేను మీకులాగే స్టూడెంట్‌ని.. ఇప్పుడు కలెక్టర్‌నయ్యా.. అదెలా సాధ్యమైందంటే.. నాకంటూ ఒక గోల్ .. పట్టుదల.. పట్టుదల ఉంటే కానిదిలేదు.. మీరు అలాగే లక్ష్యం పెట్టుకోండి..పట్టుదలగా చదవండి..



మద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి అమ్మవారికి తెచ్చిన సారె

కోటసత్తెమ్మకు చీర, సారె

నిడదవోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ అమ్మవారు తిరునాళ్ల రెండో రోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అమ్మవారికి విశేష పూజలు చేశారు. జంగారెడ్డి గూడెం మండలం గుర్వాయిగూడెంలోని మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి, నిడదవోలు పట్టణంలో మాంగళ్యదేవిఅమ్మవారి దేవస్థానం నుంచి చీర, సారె తీసుకొచ్చారు. బాణాసంచాలతో మేళతాళాలతో గణపతి సెంటర్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అధికారులు, పండితులు వారికి స్వాగతం పలికి చీర, సారె అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వీఆర్‌కి కోరుకొండ సీఐ సత్యకిశోర్

కొత్త సీఐ నియామకం - ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌లకు బాస్‌లైన పలువురు సీఐల స్థాయి అధికారుల అవినీతిపై 'ఇదేంటి బాస్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై కదలిక వచ్చింది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. నిఘా విభాగం డీజీ వెంటనే నివేదిక పంపాలని ఆదేశించారని తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరైన కోరుకొండ సీఐ వై.సత్య కిశోర్‌పై తొలి వేటు పడింది. ఆయనపై ఆరు నెలల కిందటే తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఏదో విధంగా గప్‌చుప్ చేసేశారు. అయితే ఈసారి వేటు తప్పలేదు. ఆయనను ఏలూరు రేంజ్ వీఆర్‌కి పంపుతూ శుక్రవారం డీజీ ఉత్తర్వులిచ్చారు. ఆ స్థానంలో విజయవాడ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణమూర్తిని నియమించారు. జిల్లాలోని పలువురు సీఐ స్థాయి అధికారులపై రాష్ట్ర స్థాయి అధికారులు దృష్టి సారించినట్టు చెబుతున్నారు.

ఆనందాలబడి!



- పండుగలా పీటీఎం
- సందడిగా పాఠశాలలు
- తరలివచ్చిన పేరెంట్స్
- ఆనందంగా చిన్నారులు
- మంచిపై అవగాహన
- ప్రభుత్వ బడుల్లో నిర్వహణ
- 5 లక్షల మంది హాజరు

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బడి వాతావరణం మారిపోయింది.. మామిడి తోరాణాలు..స్వాగతం బోర్డులతో నిండిపోయాయి..పూలదండలతో అలంకరించుకొన్న బడులు తల్లిదండ్రులు, ప్రముఖులకు స్వాగతం పలికాయి. భారీ టెంట్‌లు.. మరో పక్క వంటలు.. ఇంకో పక్క నిన్నటి వరకూ పుస్తకాలతో నీరసంగా బడిబాట పట్టిన చిన్నారులు.. శుక్ర వారం ఆడుతూ పాడుతూ బడికొచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆనందంగా గడిపారు. తల్లిదండ్రులు, గురువుల ఆత్మీక కలయిక పండుగ వాతావరణంలో జరిగింది. జిల్లాలో 988 ప్రభుత్వ, 586 ప్రైవేటు పాఠ శాలల్లోని 2,37,754 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, అధికారులు, ఆ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు తదితరులు కలిపి సుమారు 5 లక్షల మంది వేడుకలకు హాజరయ్యారు. పిల్లల బంగారు భవితకు బడి వైపు ఒక్క అడుగు ముందుకు అనే నినాదంతో భారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరవలి మం డలం ముక్కామలలో మంత్రి దుర్గేష్, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో కలెక్టర్ కీర్తి చేకూరి, కొవ్వూరులో ఎస్పీ నరసింహ కిశోర్ పాల్గొన్నారు. ధవళేశ్వరంలో రాజమ హేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, బిక్కవోలు మండలం పందలపాకలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కోరుకొండలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వ రరావు, నల్లజర్ల మండలం దూబ చర్లలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. చిన్నారులతో ముచ్చటించారు. కలిసి భోజనం చేశారు..వారు చేసిన సైన్స్ ప్రాజె క్టులు చూసి ఆనందం వ్యక్తం చేశారు. మా చిన్నప్పుడు అంటూ తమ పాత రోజులను గుర్తు చేసుకున్నారు.ఉన్నత స్థాయికి ఎదిగే క్రమంలోని పరిశ్రమ, పట్టుదల, లక్ష్యసాధనను వివరించారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రు లకు ఉపాధ్యాయులు నివేదించారు. విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు, క్రాఫ్టులు ఆలో చింపజేశాయి. ప్రోగ్రెస్ కార్డులను అందించారు. విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తూ పెద్దలు భోజ నాలు చేశారు. సెల్ఫీలు సందడి చేశాయి.

రేపటి భవిష్యత్ మీరు : మంత్రి

నేను మీ స్థాయి నుంచి వచ్చినవాడినే.. రేపటి భవిష్యత్ మీరు. తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు నిర్మాణ మవుతుంది. ప్రతీ అంశం గురువుల ద్వారా విద్యార్థులకు తరగతి గదిలోనే బోధపడుతుంది. పాఠశాలకు పంపించడమే కాకుండా తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత ఆ రోజున పిల్లలు పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో తల్లిదండ్రులు గమనించడం ముఖ్యం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య అనుసంధానం లేకపోతే పిల్లలను తీర్చిదిద్దం కష్టం.



విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేస్తున్న ఎమ్మెల్యేలు ముప్పిడి, మద్దిపాటి, ఆదిరెడ్డి వాసు

సృజనాత్మక బోధన సాగాలి : కలెక్టర్

సృజనాత్మకత పెంపొందించేలా బోధన సాగాలి. విద్యార్థులు నేర్చుకునే విధానంలో సాంకేతికత ఎంత వరకూ ఉపయోగపడుతోంది. అసైన్‌మెంట్లను మొబైల్‌లో చూసి కేవలం రాసే అలవాటుతో నిజమైన అభ్యాసం జరుగుతోందా అనే అంశాలను ఉపాధ్యాయులు సమీక్షించాల్సిన అవసరం ఉంది. సెల్‌ఫోన్ వల్ల కంటి చూపుపై ప్రతికూల ప్రభావం పడుతుంది. స్కూల్స్‌లో ఉన్న అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థుల్లోని ఆవిష్కరణల ఆలోచనలను వెలికి తీయాలి. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం మన సంయుక్త బాధ్యత. వారి బంగారు భవిష్యత్తుకు దిశ స్పష్టంగా ఉండే విధంగా మార్గనిర్దేశం చేయడం తల్లిదండ్రులు, అధికారులు, ఉపాధ్యాయుల కర్తవ్యం.



ఫస్ట్ మాస్టార్‌ని.. తర్వాతే ఎస్పీనయ్యా!

నేడు ఒకప్పుడు టీచర్‌ని..మీలాంటి ఎంతో మంది పిల్లలకు పాఠాలు చెప్పినవాడిని.. సమాజానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో చదివా పోలీస్‌నయ్యా.. మీ జిల్లా ఎస్పీగా ఉన్నా. పట్టుదల ఉంటే కానిది ఉండదు.. పట్టుదలగా చదవాలి.. ఎదగాలి. తల్లితండ్రులు పిల్లలను చదివించడమే కాకుండా మంచి ప్రవర్తన కలిగి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మాదకద్రవ్యాలు ఒకప్పుడు మారుమూల మన్యంలో మాత్రమే ఉండేవి. నేడు మెరుగైన రవాణా, సెల్‌ఫోన్ వినియోగంతో విద్యార్థులకు సైతం అందుబాటులోకి వస్తుంది. దీని పట్ల అప్రమత్తంగా ఉండాలి. సమాజంలో చెడు అలవాట్ల కారణంగా క్రైమ్ పెరుగుతుంది. ఈ క్రైమ్‌లో ఎక్కువగా మహిళలు, పిల్లలు బాధితులుగా ఉంటున్నారు. కొవ్వూరు పాఠశాలలో పనిచేస్తున్న తన మిత్రుడు రవికుమార్ ఆహ్వానంపై ఈ కార్యక్రమానికి రావడం జరిగింది.

పుష్కర.. గోదారి!



రాజమహేంద్రవరంలో గత పుష్కరాలకు నిర్మించిన అతిపెద్ద కోటిలింగాల ఘాట్

ఇప్పటి నుంచే పుష్కర సన్నాహాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

2027 గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.12 ఏళ్లకోసారి వచ్చే గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహించ నున్నారు. కోట్లాది మంది భక్తులు తరలి వచ్చే పుష్కర స్నానాలకు ప్రభుత్వం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గోదావరి వెంబడి స్నానపు ఘాట్లను భారీస్థాయిలో సిద్ధం చేస్తోం ది. ఒకేసారి లక్షలాది మంది స్నానం చేసేలా ఘాట్లను తీర్చిదిద్దనున్నారు.పుష్కర స్నానాలు రాజమహేంద్రవరం, కొవ్వూరులో అత్యధికంగా జరగనుండగా ఆ తర్వాత కాకినాడ, కోనసీమ జిల్లాల్లో జరగనున్నాయి.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్

- 2027లో గోదావరి పుష్కరాలు
- కోట్లాది మంది భక్తుల అంచనా
- మరిన్ని ఘాట్లకు ప్రతిపాదనలు
- ప్రజాప్రతినిధుల అంచనాలు
- కాకినాడలో 10 ఘాట్లు
- ఉమ్మడి జిల్లాలో పుష్కర సందడి

కాకినాడలో 10 ఘాట్లు..

కాకినాడ జిల్లాలో పది ఘాట్లను రూ.5 కోట్లతో సుందరీకరించేందుకు అంచనాలు సిద్ధం చేసింది. పదిలో కాజులూరు మండలంలో రెండు, తాళ్లరేవు మండలంలో 8 ఘాట్లను ముస్తాబు చేయాలని నిర్ణయించింది. ఒక్కో ఘాట్ 15 నుంచి 30 మీటర్ల మేర పొడవుతో నిర్మిస్తోంది. కాజులూరు మండలం పెద్దలంక, అంద్రంగి, తాళ్ల రేవు మండలం పిల్లంక, గోపుల్లంక, గోవలంక వద్ద 20 మీటర్ల పొడవైన ఘాట్ల ను ఆధునికీకరిస్తోంది.కొత్తగా ఇంజరం, పిల్లంక వద్ద కొత్తలంక పరిధి , తాళ్లరేవు పట్టణం ఐత్రీయ కోరంగి బ్రాంచి వద్ద నందిరేవులో కొత్త స్నానపు ఘాట్‌ను నిర్మించనున్నారు. కోరంగిలో శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద గోదావరిని ఆనుకుని మరో ఘాట్ నిర్మించనున్నారు. తాళ్లరేవు మండలంలో సిద్ధం చేస్తోన్న ఎనిమిది ఘాట్లకు కాకినాడతో పాటు కోనసీమ జిల్లా నుంచి భారీగా పుష్కర స్నానాలకు భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అఖండ గోదావరి నది సముద్రంలో సంగమించే చివరి ప్రాంతం తాళ్లరేవు, యానాం కావడంతో పుష్కర స్నానాలకు భక్తులు ఇక్కడకు భారీగా వస్తారని భావిస్తు న్నారు.పైగా గోదావరి మూడు పాయలు కలిసే ప్రాంతం ఇక్కడే కావడంతో సెంటిమెంట్‌గా భావించి స్నానాలకు ఇక్కడకు వచ్చే వారు లక్షల్లో ఉంటారని లెక్కలేస్తున్నారు. 2015 పుష్కరాల్లో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గోదావరి మూడు పాయలు కలిసే యానాం సమీపంలో పుష్కర స్నానం ఆచరించడంతో ఇక్కడ స్నానమాచరిస్తే మరింత పుణ్యం వస్తుందని ప్రచారం జరిగి అప్పట్లో లక్షల్లో పోటెత్తారు. దీంతో ఈసారి కూడా ఎంత రద్దీ వచ్చినా తట్టుకునేలా ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కోనసీమలో కోటిపల్లి, కపిలేశ్వర పురం, యానాం, నగరం, అప్పనపల్లి, ముక్తేశ్వరం, మురమళ్ల, కుండలేశ్వరం, కొత్తపేట, జొన్నాడ, రావులపాలెం తదితర ప్రాంతాల్లో ఘాట్లు ఉన్నాయి. ఈ జిల్లాలో కూడా ఘాట్లు పెంచే యోచనలో ఉన్నారు.

రాజమహేంద్రవరంలో ఒకే ఘాట్ అయ్యేనా?

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో 2027లో జరిగిన గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి తగ్గట్టుగా స్నానాల రేవుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గత నెలలో మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో అధికారులు, ఎమ్మెల్యేలతో నూతన ఘాట్లు, ఘాట్ల అనుసంధాన ప్రక్రియపై చర్చించారు.రాజమహేంద్రవరంలో గౌతమి ఘాట్ మొదలుకొని పుష్కరాల రేవు వరకూ ఘాట్లను అనుసంధానం చేసే ప్రక్రియపై ప్రతిపాదనలు ఉన్నాయి.ఈ ఘాట్లు కలుపుతారా విడివిడిగా అభివృద్ధి చేస్తారా అనేది తేలాల్సి ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలో నాల్గో బ్రిడ్జి కింద నుంచి రెండు అతిపెద్ద వీఐపీ ఘాట్లను నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. రాజానగరం నియోజకవర్గం బొబ్బిల్లంక, మునికూడలి ప్రాంతాల్లోనూ ఘాట్లు నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

కొవ్వూరులో ఇలా..

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో రూ.135.50 కోట్లతో 53 ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో 8 రేవులు 1.2 కిలోమీటర్లు మేర రూ.90 కోట్లతో ఒకే ఘాట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఘాట్లను భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తరించడంతో, మరి కొన్ని కొత్తఘాట్లను ప్రతిపాదించారు. కొవ్వూరు పట్టణ, మండలంలో పాతవి 20, కొత్తవి 8, తాళ్లపూడి మండలంలో పాతవి 8, కొత్తవి 2, నిడదవోలు పట్టణ, మండలంలో పాతవి 3, కొత్తవి 2, పెరవలి మండలంలో పాతవి 7, కొత్తవి 3 ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి అందజేశారు.నిడదవోలు మండలం విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం వరకు గోదావరి ఏటిగట్టు రహదారి సుమారు 30 కి.మీ రూ.70 కోట్లతో నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెప్పారు



మధురపూడి ఎయిర్‌పోర్ట్

అదిగో..ఇండిగో..

వచ్చేస్తోంది!

- ఆకాశంవైపు చూపులు
- ఎంతకీ రాని విమానాలు
- పలు సర్వీసులు రద్దు
- ప్రయాణికుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వియాన ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. విమానాలు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తుండడంతో ఎయిర్‌పోర్ట్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఎప్పుడు విమానం వస్తుందో ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక అక్కడే పడిగాపులు కాస్తున్నారు. ఇండిగో విమాన పైలెట్ల రెస్ట్ విషయంలో ఏర్పడిన వ్యవహారంతో కొన్ని విమానాలు రద్దవడంతో పాటు కొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో అనేక మంది ప్రయాణాలు మానుకోగా.. మరికొందరు విమానాశ్రయాల్లో వేచి చూస్తున్నారు. రాజ మహేంద్రవరం నుంచి అనేక మంది న్యూఢిల్లీ, ముంబయి,హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు ప్రతీ రోజు వందలాది మంది విమా నాల్లో ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం ఇండిగో విమాన సంస్థలో ఏర్పడిన సమస్యతో సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. పైలెట్ల కొరత తెరమీదకు వచ్చింది. ఇండిగో యాజమాన్యం పైలెట్లకు విశ్రాంతి ఇవ్వడంలేదని సమాచారం బయటకు రావడంతో ఎయిర్‌పోర్టు అథార్టీ పైలెట్లకు విశ్రాంతి తప్పనిసరి చేసినట్టు సమాచారం. దీంతో పైలెట్ల కొరత ఏర్పడి విమానాలు రద్దవుతున్నాయి. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి ప్రతి రోజూ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి,న్యూఢిల్లీ 11 విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తిరుపతికి రోజు విడిచి రోజు ఒక విమానం వెళ్లొస్తుంది.కానీ గురువారం నుంచి ఆకస్మికంగా విమానాలు రద్దవడం,ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.గురువారం రాత్రి రాజమహేంద్రవరం నుంచి ముంబయి వెళ్లాల్సిన 160 మంది ప్రయాణికులు రాత్రంతా విమానాశ్రయంలో జాగరణ చేశారు. రాత్రి 8.30 గంటలకు రావాల్సిన ముంబయి విమానం శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు వచ్చింది. తిరిగి ఐదు గంటలకు వెళ్లింది. ఎయిర్‌పోర్టు, విమాన సంస్థ అధికారులు కొందరు ప్రయాణికులకు రాజమహేంద్రవరంలో హోటల్ రూమ్‌లు బుక్ చేయగా, కొందరు ఇళ్లకు వెళ్లి వచ్చారు.రాజమహేంద్రవరం విమానాశ్రయంలో గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదు. ఇక శుక్రవారం న్యూఢిల్లీ, ముంబయి విమానాల సర్వీసు రద్దయింది. బెంగళూరు, చైన్నై, హైదరాబాద్ నుంచి రావాల్సిన విమా నాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. బెంగళూరు నుంచి శుక్రవారం ఉదయం రావాల్సిన విమానం అర్ధరాత్రి 12 గంటలకు రావొచ్చని అధికారులు చెబుతున్నారు.దీంతో సుమారు 70 మంది ప్రయాణికులు ఈ రాత్రి కూడా ఎయిర్‌పోర్టులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై విమానం శుక్రవారం రావాల్సి ఉండగా శనివారం రానున్నట్టు సమాచారం. గురువారం 670 మంది ప్రయాణం చేయగా.. శుక్రవారం బాగా తగ్గడం గమనార్హం.

4 విమాన సర్వీసులు రద్దు

మరో నాలుగు ఆలస్యం

కోరుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయం నుంచి ఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరు,హైదరాబాద్‌లకు వెళ్లాల్సిన ఇండిగో ఎయిర్‌లైన్ సంస్థకు చెందిన 4 విమాన సర్వీసులు శుక్రవారం రద్దయ్యాయి. అదే విధంగా మరో నాలుగు విమాన సర్వీసులు ఆలస్యంగా నడిచాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. హైదరాబాద్- రాజమహేంద్రవరం మధ్య నడిచే విమాన సర్వీసు 45 నిమిషాలు, మద్రాసు-రాజమహేంద్రవరం మధ్య విమానసర్వీసు 30 నిమిషాలు,హైదరాబాద్- రాజమహేంద్రవరం మధ్య నడిచే విమాన సర్వీసు 1.15 గంటలు,హైదరాబాద్-రాజమహేంద్రవరం మధ్య నడిచే మరో విమాన సర్వీసు 2 గంటలు ఆలస్యంగా నడిచాయి. ఇండిగో ఎయిర్ లైన్స్ సంస్థకు దేశ వ్యాప్తంగా పైలెట్స్ కొరత కారణంగా ఈ సర్వీసులు రద్దు అయినట్టు తెలిసింది. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.

జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ నిర్ధారణ టెస్టు కిట్లు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో స్క్రబ్ టైఫస్ అనుమానిత కేసులకు ర్యాపిడ్ టెస్టులు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు 20 స్క్రబ్ టైఫస్ నిర్ధారణ ర్యాపిడ్ కిట్లు సిద్ధం చేసినట్టు సమాచారం. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ శుక్రవారం అందరు క్లినికల్ వైద్యులకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. అనుమానిత కేసులకు సంబంధించిన శాంపిల్స్‌ను మైక్రోబయాలజీ విభాగానికి పంపించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. కిట్లు దుర్వినియోగం కాకుండా సంబంధిత వైద్యుడి సంతకం, స్టాంపుతో ఎమర్జన్సీ అని రాసి శాంపిల్స్ పంపించాలని సూచించారు. స్క్రబ్ టైఫస్ కేసులు ఒక చిన్న పురుగు కుట్టడం ద్వారా వస్తుందన్నారు.

రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం : నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కొమరిపాలెంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.14 వేల కోట్ల విలువైన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు ధాన్యం అమ్మిన 4 నుంచి 24 గంటల్లో సొమ్ములు వారి ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. గతంలో మీహయాంలో ధాన్యం చెల్లింపులు ఎలా చేసారో ఆత్మ విమర్శ చేసుకోవాలని వైసీపీ వారికి సూచించారు.రబీ సాగుకు యూరియా కొరత లేదన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు 7500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా వ్యవసాయశాఖ ఆధీనంలో 9 వేల మెట్రిక్ టన్నులు ఉందన్నారు. రబీ సీజన్‌లో ఎకరాకు రైతు 150 కిలోల యూరియా వాడాల్సి వుండగా మూడు రెట్లు అధికంగా వాడడం వల్ల ఖర్చు పెరిగి, దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. అందు వల్ల కేంద్రప్రభుత్వం రైతులను యూరియా, పురుగుమందులు వాడకం తగ్గించి పకృతి సిద్ధంగా లభించే ఎరువులు వాడాలని సూచిస్తుందన్నారు.ఆయన వెంట కూటమి నేతలు పడాల వెంకటరామారెడ్డి, డీవీఆర్, దుర్గారెడ్డి, కర్రి సత్యవేణి, చిన్నం వీరభద్రారెడ్డి, ఇందల వీరబాబు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



ముక్కామల పాఠశాల విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ఉచిత కంటి వైద్యశిబిరం

దేవరపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెంలో ఆమేన్ ట్రస్ట్, శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాదెండ్ల విష్ణువర్దన్ మాట్లాడుతూ పౌష్టికాహారం, కూరగాయలు, పండ్లు ఎక్కువ తీసుకోవడం వల్ల కంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలి

● రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ● పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లు

పెరవలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ ఉన్నతస్థాయికి ఎదగాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం ముక్కామల హైస్కూల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం)లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలతో కూడిన విద్యనందించేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతా త్రిమూర్తులు, డీఈవో వాసుదేవరావు, హెచ్‌ఎం విఘ్నేశ్వరరావు, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీవో ఉమా రాజ్యలక్ష్మి, తహశీల్దార్ నిరంజన్, కూటమి నాయకులు అతికాల శ్రీను, పిప్పర రవి, భూపతిరాజు రవివర్మ, కోటిపల్లి మురళీకృష్ణ, నల్ల సురేంద్ర, వెంకట రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్ల వల్లే క్రైమ్ పెరుగుదల

● జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్

కొవ్వూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో చెడు అలవాట్ల కారణంగా క్రైమ్ పెరుగుతోందని ఎస్పీ డి.నరసింహ కిషోర్ అన్నారు. శుక్రవారం ఐ.పంగిడి పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్పీ నరసింహ కిషోర్ హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఒకప్పుడు మారుమూల మన్యంలో మాత్రమే ఉండేవని, నేడు మెరుగైన రవాణా, సెల్‌ఫోన్ వినియోగంతో విద్యార్థులకు సైతం అందుబాటులోకి వస్తుందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీను ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ పాఠశాల విద్యలో కూటమి ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, డీవైఈవో కేవీఎస్.రామాంజనేయులు, పాఠశాల హెచ్‌ఎం మంగిన శ్రీరామారావు, బేతిన నారాయణ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయణ, విద్యా కమిటీ చైర్మన్ కారింకి వెంకటలక్ష్మి, నాయకులు పికె.రంగారావు, జొన్నా బాలకృష్ణ, చౌటిపల్లి శివ, సుంకర సత్తిబాబు, కొప్పాక విజయ్‌కుమార్, ఎం.నాగరాజు, కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య ... ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వాడపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే , ఆర్డీవో రాణీసుస్మిత పాల్గొని స్పోర్ట్స్ కిట్లు, క్రీడా పరికరాలను అందించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పాటు ఎమ్మెల్యే క్యూలైన్‌లో నిల్చుని భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ గెల్లా ప్రసాద్, గెల్లా కేశవ, బూరుగుపల్లి రాముడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

నిడదవోలు: విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత వహించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మున్సిపల్ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎస్పీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



నిడదవోలులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

పెరవలి: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ (ఆత్మీయ సమావేశం) నిర్వహించారు. కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పెరవలి, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి, ఖండవల్లి, అన్నవరప్పాడులోనూ ఉత్సాహంగా కార్యక్రమాలు జరిగాయి. కానూరులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు, జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ గౌరీ శంకర్, కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ శ్రీనివాస్, రంకిరెడ్డి ప్రసాద్, ఎంఎం. సుధాకర్ పాల్గొని మాట్లాడారు.

ఉండ్రాజవరం: మండలంలో పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు శుక్రవారం పలు పాఠశాలల్లో నిర్వహించారు. స్థానిక హైస్కూలులో జరిగిన సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు పసల సుబ్బారావు, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, ఎంఈవోలు సక్సేనరాజు, శారదాజ్యోత్స్న, పీహెచ్‌సీ డాక్టర్ దుర్గామహేశ్వరరావు, ఏంపీడీవో ఆఫీసు ఏవో రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, టీచర్లు పాల్గొన్నారు. మోర్త, తాడిపర్రు హైస్కూళ్లలోనూ నిర్వహించారు.

చాగల్లు: పిల్లల విద్యాభివృద్ధే లక్ష్యంగా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంకితభావంతో కలిసి పనిచేయాలని డీవైఈవో కేవీఎస్ రామాంజనేయులు అన్నారు. ఊనగట్ల హైస్కూల్లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యను పటిష్ఠం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చాగల్లు హైస్కూల్లో జరిగిన సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు పాల్గొన్నారు. అలాగే మండలంలోని 38 పాఠశాలల్లోనూ పేటీఎం సమావేశాలు జరిగాయి. తల్లిదండ్రులు పాల్గొని పిల్లల భవిష్యత్‌కు సూచనలు చేశారు.

తాళ్లపూడి: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సందర్శించారు. అన్నదేవరపేటలోని అల్లూరి సూరన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలెక్టరు విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుతున్నరా, ఉపాధ్యాయులు చెబుతున్న పాఠాలు అర్థమవుతున్నాయా, మధ్యాహ్న భోజనం బావుంటుందా, మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నలు అడిగారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సుభాషిణి, ఎంఈవోలు బాలామణి, నెహ్రాజీ, అల్లూరి విక్రమాదిత్య, ముళ్లపూడి రామచంద్రం, కూచిపూడి గణపతి, విద్యాకమిటీ చైర్మన్లు, సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

గోపాలపురం: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని ఎంపీడీవో జీ.రాజ మనోహర్ అన్నారు. శుక్రవారం ప్రత్యేక పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కి హాజరయ్యారు. సర్పంచ్ నూతంగి సరోజిని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం నింపేది విద్యే అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గద్దే హరి బాబు, టీడీపీ నాయకులు నూతంగి దొరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మధు

విద్య వెన్నెముకలాంటిది : ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విద్యార్థులకు విద్య వెన్నెముకలాంటిదని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం దూబచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీటీసీ ఈడే శ్రీను తండ్రి ఈడే వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం స్కూల్‌లో నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే ఈడే శ్రీను బహూకరించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రావడానికి వెళ్లడానికి విద్యార్థుల కోసం అయ్యవరం, కొత్తగూడెం, గాంధీ కాలనీ మీదుగా బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు ఉపాధ్యాయులు ఎమ్మెల్యే మద్దిపాటిని ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ నేటి సమాజానికి విద్య వెన్నెముకలాంటిదన్నారు. విద్యతోనే వ్యక్తి అనుకున్న లక్ష్యానికి చేరుకోవచ్చన్నారు. ఆర్థికాభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే ఏకైక మార్గమన్నారు. ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేది సమ సమాజ నిర్మాణానికి బాటలు వేసేది విద్యే అన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



దూబచర్ల హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి : నాదెళ్ల

చాగల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చాగల్లు బీసీ కాలనీలో రూ. 9.5 లక్షలు వ్యయంతో డిఎంఎస్ నిధులుతో నిర్మాణం చేసే పైపులైను పనులకు శంకుస్థాపన జరిగింది. ప్రజలకు తాగునీరు సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చాగల్లు బీసీ కాలనీలో పైపు లైను పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

ప్రక్కిలంకలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ఎమ్మెల్యే ముప్పిడి, అల్లూరి విక్రమాదిత్య, తదితరులు

తాళ్లపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంకలో వేంచేసియున్న శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో వార్షికోత్సవ ఉత్సవాలను ఆలయ కమిటీ ఘనంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆలయానికి విచ్చేసి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సొలస గిరిధర గాంధీ, విశ్వనాథం, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పెద్దింటి భార్గవ, శ్యామ్ దుశ్శాలువాలు కప్పి వేదాశీర్వచనంతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య, డా. ఆర్ రవికుమార్ రెడ్డి, డాక్టర్ దత్తాత్రేయులు, కూచిపూడి గణపతి, నాయుడు హనుమంతరావు, మాజీ ఎంపీపీ కొప్పాక కోట్నీస్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండల టీడీపీ నూతన కమిటీ ఇదే..





నూతన అధ్యక్షుడు మునేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రామారావు

దేవరపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలకార్యవర్గాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా తంగెళ్ల మునేశ్వరరావు (దేవరపల్లి), ప్రధాన కార్యదర్శిగా ఉప్పులూరి రామారావు (దేవరపల్లి), మండల ఉపాధ్యక్షులుగా యర్రంశెట్టి ముత్యాలరావు (త్యాజంపూడి), బాదంపూడి ఇందిర (యర్నగూడెం), మండల కార్యనిర్వాహక కార్యదర్శులుగా యర్రగొల్ల వెంకటేశ్వరరావు లక్ష్మీపురం), బొల్లం దుర్గారావు (పల్లంట్ల), అక్కెం పెదకాపు (యాదవోలు), మండల కార్యదర్శులుగా ముప్పన సుధీర్‌కుమార్ (గౌరీపట్నం), పల్లపాటి రామారావు (చిన్నాయిగూడెం), మండల కోశాధికారిగా కాకర్ల సత్యరామకృష్ణ (దుద్దుకూరు) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు నాయకులు, ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గౌరీపట్నం సొసైటీ అధ్యక్షుడు అంద్రా అనిల్‌ను బీసీసీబీ డైరెక్టర్‌గా నామినేట్ చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు తొమ్మిది ఫిర్యాదులు

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను గ్రీవెన్స్‌లో రాత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి తొమ్మిది ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు బేతిన నారాయణ, సర్పంచ్ మేకల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

'విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాలి'

దేవరపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని గోపాలపురం నియోజకవర్గ డెవలప్‌మెంట్ ఆఫీసర్ భాగ్యవతి అన్నారు. దేవరపల్లి జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఏ అం శాలపై మెరుగ్గా ఉన్నారో వార్నిదాంట్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాభ్యాసం బోధించాలన్నారు. వెనుకబడి ఉన్న విద్యార్థులను మెరుగైన విద్య కోసం ప్రత్యేక క్లాసులు నిర్వహించివారు విద్యాభ్యాసంలో మెరుగైన ఫలితాలు సాధించడానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన టీచర్స్ పేరెంట్స్ మెగా పీటీఎం ప్రోగ్రాం వల్ల విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. ఎంఈవో అప్పారావు మాట్లాడుతూ మండలంలో 34 ప్రభుత్వ పాఠశాలలు 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయని ఉపాధ్యా యులతో పాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ డెవలప్‌మెంట్ ఆఫీసర్ భాగ్యవతి

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

దేవరపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం నిర్మల హృదయ బాలికల కళాశాలలో శుక్రవారం మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో ఏఎస్సై గంగాధర్ మాట్లాడుతూ కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆదేశాల మేరకు శక్తి టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించటం జరుగుతుందని ఏఎస్సై గంగాధర్ తెలిపారు. ప్రతిఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ పోలీసులు భవాని, పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్ఐ గంగాధర్

మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ దాన్ని కప్పి పుచ్చుకోవడానికి సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్‌కు కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

యూపీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా రామచంద్రరావు

కొవ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణానికి చెందిన మడిచర్ల రామచంద్రరావు యూపీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్ గేటు సెంటర్‌లో ఉన్న యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌ను కలిశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్య క్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్‌కు నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర

ధ్యానంతో మానసిక ప్రశాంతత

దేవరపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్వాసపై ధ్యాస ఉంటే ఆరోగ్యం పెంపొందుతుందని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు పప్పు వెంకట్రామారావు అన్నారు. దేవరపల్లిలో విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రఎవారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఒకరోజు ధ్యాన శిక్షణ తరగతి జరిగింది. పిరమిడ్ మాస్టర్ మొతుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ ధ్యాన విశిష్టత మండలంలో ఎన్నో మార్పులు తీసు కొస్తుందని మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పూర్ణ యోగా ఆశ్రమ రామచంద్ర గురూజీ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు బండి సూర్యప్రకాశ్, జిల్లా పిరమిడ్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాస్, స్థానికులు కేసిరాజు సీతారామయ్య, కేసిరాజు రాజ్‌కుమార్, బళ్లా సూర్యచక్రం, పట్టపు నాగేశ్వరరావు, సూర్య కుమారి, పలు గ్రామాల నుంచి హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న పప్పు వెంకట్రామారావు

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను నియమించాలి

● కలవలపల్లి గ్రామస్థుల డిమాండ్

చాగల్లు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మెరుగైన వైద్యసేవలు అందిస్తూ గుర్తింపు పొందిన ఆసుపత్రిలో ప్రస్తుతం సిబ్బందిలో సగం మంది డిప్యుటేషన్‌లో వెళ్లిపోయారు. దీంతో రోగులకు సరియైన వైద్యం అందడం లేదని రోగులు వాపోతున్నారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిని తిరిగి ఆసుపత్రికి వెనక్కి రప్పించాలని కోరుతున్నారు. స్టాఫ్ నర్సు, ఎంపీహెఈవో, ఏఎన్ఎం వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రోగులకు సరియైన వైద్యం అందడం లేదు. ఆసుపత్రి పరిధిలో కుక్కకాటు, పాముకాటు కేసులు, గర్భిణుల సమస్యలు ఎక్కువగా ఉన్నందున డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యసిబ్బందిని వెనక్కి రప్పించి ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్టు

సీతానగరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపట్నం శివారున గంజాయి తరలిస్తున్న మహిళను అరెస్టు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు సిబ్బందితో పురుషోత్తపట్నం శివారున దాడి చేసి పట్టుకున్నట్టు చెప్పారు.